ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 2 సెప్టెంబరు 2024 | 5





సీఎస్ఆర్.. నిధుల్!

జిల్లాలో చిన్నా పెద్దా కలిసి సుమారు 400 వరకూ పరిశ్రమలు ఉన్నట్టు సమాచారం. ఆయా పరిశ్రమలు సామాజిక బాధ్యతగా తమ ఆదాయం నుంచి 2శాతం సీఎస్ఆర్ నిధులకు కేటాయించాలి.. ఆ కంపెనీ ఉన్న ప్రాంతంలో అభివృద్ధి చేయాలి.. గతంలో అలాగే చేసేవారు. కాలం మారింది.. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతను బరువుగా ఫీలవుతున్నా యి.. జిల్లా యంత్రాంగం గత మూడేళ్ల నుంచీ సీఎస్ఆర్ నిధుల లెక్కలు ఇవ్వాలని 15 కంపెనీలకు లేఖలు రాస్తే కేవలం 4 కంపెనీలే స్పందించాయి. ఉన్నతాధికారులు సేవ చేయడానికి ముందుకు రావాలని కోరినా పట్టించుకోకపోవడం గమనార్హం. చట్టాల ముసుగులో సేవకు స్వస్తి చెబుతున్నారనేది వాస్తవం.

పరిశ్రమలకు..భారమా!?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సీఎస్ఆర్ నిధుల్లో అయోమయం నెలకొంది. పరిశ్రమల యాజమాన్యాల ఆలోచన పక్కదారి పట్టడంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులను ఏదో విధంగా దారి మళ్లించేస్తున్నారు. చట్టంలోని అంశాలను పరిశ్రమలు తమకు అనుకూలంగా అన్వయించుకోవడంతో అధికారులు సైతం వెనుకడుగు వేసే పరిస్థితి ఉంది. జిల్లా నుంచి లబ్ధి పొందుతూ ఎక్కడో ఏదో చేస్తున్నామంటూ కాగితాలపై లెక్కల గారడీ తప్ప వాస్తవంలో మాత్రం చేసిందేం కనిపించడంలేదు. సమాజానికి ప్రయోజనకరంగా ఆదర్శంగా నిలవాల్సిన పరిశ్రమలకు సామాజిక బాధ్యత బరువుగా మారడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ప్రహసనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సోషల్ రెస్పాన్సిబిలిటీ ఏమైంది?

పరిశ్రమలు సమాజానికి మేలు చేయాలనే ఉద్దేశంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)ని చట్ట సవరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. పర్యావరణ హితం, నైతిక బాధ్యత, దాతృత్వం, ఆర్థిక చేయూత వంటివి దీనిలో ఇమిడి ఉన్నాయి. సీఎస్ఆర్ నిధులను కొన్ని జిల్లాల్లో స్వచ్ఛందంగా కలెక్టరు ఖాతాకు జమచేయడం ద్వారా ఆయా గ్రామాలు/ పట్టణాల్లో మౌలిక వసతులు కల్పిస్తారు. కానీ కొన్ని జిల్లాల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. సీఎస్ఆర్ నిధులను కంపెనీలు సొంతంగా సామాజిక అవసరాలకు ఖర్చు చేయొచ్చని చట్టం చెబుతుండడంతో తాము ఫలానా పనులు చేశామంటూ లెక్కల్లో చూపెడుతున్నారు. వాస్తవంలో వీటిని తనిఖీ చేసే యంత్రాంగం లేకపోవడంతో కాగితాలపై ఉన్న లెక్కలనే నమ్మాల్సి వస్తోంది. భారీ కంపెనీలు సైతం ఇదే పంథాలను అనుసరిస్తుండడం సమాజాభివృద్ధికి అవరోధంగా పరిణమించింది. సీఎస్ఆర్‌లో ప్రభుత్వానికి ఎలాంటి ప్రమేయం లేకపోవ డంతో అధికారులు గట్టిగా అడగలేని పరిస్థితి ఉంది. సీఎస్ఆర్ నిధులు సవ్యంగా ఖర్చు చేశారా లేదా? అనే విషయాలను కలెక్టర్ పరిశీలించవచ్చు. ఒక వేళ కంపెనీ అబద్ధాలు చెబుతోందని నిర్ధారణ అయితే బాధ్యులకు ఒక నెల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. తనిఖీలు మొదలు పెడితే తమ కార్యకలాపాలకు సదరు అధికారులు అడ్డు వస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళుతున్నాయి. ఈ క్రమంలో సీఎస్ఆర్ నిధుల వ్యవహారం సున్నిత అంశంగా మారిపోయింది. ఇప్పుడు పలు పనులకు సీఎస్ఆర్ నిధులను అడిగినా ఏదోక సాకుతో కాలం గడిపేస్తున్నారు.

నిధులు ఏమవుతున్నాయ్?

ఒక కంపెనీకి సంబంధించి ఎక్కడో ప్రధాన కార్యాలయం ఉంటుంది. ఉదాహరణకు రాజహేంద్రవరంలో ఉన్న కంపెనీకి ప్రధాన కార్యాలయం విదేశాల్లో లేదా వేరే రాష్ట్రంలో ఉంటుంది. ఇక్కడ పరిశ్రమలో ఉత్పత్తి జరగడం లాభాలు అర్జించడం జరుగుతోంది. కానీ తమ ప్రధాన కార్యాలయం రూపొందించిన ఏడాది ప్రణాళిక ప్రకారం సీఎస్ఆర్ ఖర్చు చేస్తున్నామని చెబుతారు. కంపెనీ వేరే పేర్లతో ఒక ట్రస్టు, స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా చాలా పనులు చేస్తున్నామంటూ లెక్కలు చూపెడుతున్నారు. పరిశ్రమ ఉన్న చుట్టు పక్కల గ్రామాల్లో ఆ ఏడాదిలో తమకు వచ్చిన లాభాల్లో 2% చట్ట ప్రకారం సమాజానికి ఇచ్చేశామంటూ కాగితాల్లో చూపెడుతున్నారనే అపవాదు ఉంది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో లేదా పట్టణాల్లో ప్రభుత్వం గుర్తించిన, ప్రజాప్రతినిధులు కోరిన పనులకు సీఎస్ఆర్ నిధులు రావడం లేదు. సీఎస్ఆర్ నిధులను కలెక్టరు ఖాతాకు జమ చేస్తే ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు,ఎంపీలు తదితర ప్రజా ప్రతినిధుల సిఫారసులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఇంజనీరింగ్ యంత్రాంగంతో పనులు చేయించి తగు తనిఖీల తర్వాత బిల్లులు చెల్లిస్తారు. గతంలో ఇలా పనులు జరిగిన వాటికి

- కానరాని సామాజిక సేవ
- పక్కదారి పడుతున్న నిధులు
- చట్టాలను అడ్డుపెట్టుకుని మళ్లింపు
- సామాజిక సేవకు దూరం
- అధికారులు అడిగితే బెదిరింపులే
- ఎక్కడో ఏదో చేశామని లెక్కలు
- సున్నితంగా మారిన సీఎస్ఆర్
- పథకం ఉద్దేశం అపహాస్యం

ఆయా కంపెనీలు నిధులివ్వకపోవడంతో సదరు కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించాల్సి వస్తోంది. అప్పుడు గానీ సంబంధిత కంపెనీ బిల్లు చెల్లించని సందర్భాలు ఉన్నాయంటే ఆ కంపెనీకి సీఎస్ఆర్ నిధులపై ఎంత బాధ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో పరిస్థితి దారుణం

సీఎస్ఆర్ నిధుల విషయంలో జిల్లాలో దారుణమైన పరిస్థితి కనిపిస్తోంది. పరిశ్రమలు ఉన్నా నిధుల అంశం పితలాటకంగా మారింది. కంపెనీ ఏడాది ఆదాయం రూ.5 కోట్లు ఉన్నా, కంపెనీ నికర విలువ రూ.500కోట్లు ఉన్నా, ఏడాది టర్నోవరు రూ.వెయ్యి కోట్లు ఉన్నా సీఎస్ఆర్ పరిధిలోకి రావాల్సిందే. ఇప్పటి వరకూ జిల్లాలో ఎన్ని కంపెనీలు సీఎస్ఆర్ పరిధిలోకి వస్తాయి? ఎంత సీఎస్ఆర్ ఖర్చు చేయాల్సి ఉంది? ప్రతి ఏడాదీ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారా? అనే తదితర అంశాలపై ఇప్పటి వరకూ ఒక నిర్దిష్టమైన సమాచారం లేదు. కలెక్టర్‌గా పి.ప్రశాంతి బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీఎస్ఆర్ నిధులతో కొంత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ మార్గనిర్దేశాలకు అనుగుణంగా సీఎస్ఆర్ నడుస్తోందా లేదా అనేది పరిశీలనకు ఉపక్రమించారు. గత మూడేళ్ల నుంచీ బ్యాలెన్స్ షీట్లు తదితర సమాచారం ఇవ్వాలని 15 కంపెనీలకు లేఖలు రాయగా ఇప్పటి వరకూ కేవలం 4 కంపెనీలే స్పందించడం గమనార్హం. జిల్లాలో వివిధ పనుల నిమిత్తం కేవలం రూ.30కోట్లు సీఎస్ఆర్ నిధులివ్వాలంటూ అంచనాలు జత చేసి లేఖలు రాసినా పరిశ్రమలు పెద్దగా పట్టించుకోవడం లేదు.రూ.5లక్షలు ఇవ్వడానికి పెద్ద పరిశ్రమలు వెనుకాడుతుండడం సీఎస్ఆర్ ఉద్దేశాన్ని అపహాస్యం చేస్తోంది.

ఫ్యాక్టరీలకు సేవాప్రతిపాదనలు ఇలా..

పరిశ్రమ పేరు	ప్రతిపాదిత పనులు	నిధులు(లక్షల్లో)
హెచ్‌పీసీఎల్	1	500
ఏపీ పేపర్ మిల్స్	5	303
ఐసీఐసీఐ ఫౌండేషన్	1	45
ఆంధ్రా షుగర్స్	3	15
అవంతి ఫీడ్స్	20	216
కార్గిల్ ఇండియా	1	5
గెయిల్ ఇండియా	6	388
గ్రాసిమ్ ఇండస్ట్రీస్	8	40
ఐఓసీఎల్	3	35
ఆయిల్ ఇండియా కార్పొరేషన్	2	50
ఓఎన్‌జీసీ	33	958
పవర్ గ్రిడ్	5	152
సర్వారాయ సుగర్స్	5	133
మొత్తం		2840

కలెక్టరేట్‌కు అతి దగ్గరలో ఉన్న హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఐఎల్‌టీడీలు సీఎస్ఆర్‌పై అసలు స్పందించకపోవడం గమనార్హం.



డ్రగ్స్ యూనిట్‌లో ఉన్న సామగ్రి

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

ఘంటావారిగూడెంలో డ్రగ్స్ యూనిట్ సీజ్

- ఇద్దరి అరెస్టు.. చిక్కని ప్రధాన నిందితుడు
- విస్తృతంగా పోలీసుల గాలింపు
- ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు

నల్లజర్ల,సెప్టెంబరు 1 : నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) తయారీ యూనిట్‌ను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. ఘంటావారిగూడెం చక్రధారి దాల్‌అండ్ ఫ్లోర్ మిల్‌ను ఆదివారం ఉదయం పరిశీలించి మాట్లాడారు. గ్రామానికి చెందిన రైతు తాతిన బాలుకు చెందిన చక్రధారి దాల్ అండ్ ఫ్లోర్ మిల్‌ను ఏలూరు జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి లీజుకు తీసుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ మాకం వెంకటేశ్,జగదీష్‌లతో కలిసి డ్రగ్స్ యూనిట్ నిర్వహిస్తున్నాడు.ఈ యూనిట్ ద్వారా ఆల్ప్రజోలం తయారు చేసి హైదరాబాద్‌లో కల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు.600 లీటర్ల కల్లులో ఒక గ్రాము ఆల్ప్రజోలం కలిపితే కిక్కు బాగుంటుందని సమాచారం. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన కల్లు వ్యాపారులు ఆల్ప్రజోలం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)కు సమాచారం అందడంతో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు మాదక ద్రవ్యాల తయారీ కేంద్రంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో డ్రగ్ తయారీకి ఉపయోగపడే రా మెటీరియల్, ఆయిల్ బాత్ మిషన్, ఓవెన్, ఇతర యంత్ర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు.నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.ప్రధాన నిందితుడు పోలీసులకు చిక్కకపోవడంతో గాలింపుచర్యలు వేగవంతం చేశారు. ఈ కేసుకు సంబంధించి మరి కొందరిని ఆదుపులోకి తీసుకోవాలన్నారు. నిందితులపై ఎన్‌డీపీస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.జిల్లాలో ఇటువంటి అసాంఘిక కార్యకలపాలు,కుటీర పరిశ్రమలు నెలకొల్పకుండా ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు యథాతథంగా పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్ ,సెప్టెంబరు 1: జిల్లా వ్యాప్తంగా జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ ఎస్.చిన్నరాముడు ఇతర జిల్లాల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అన్ని కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు.



కదలరు..వదలరు

- రాజానగరంలో పాతుకుపోయిన కానిస్టేబుళ్లు
- మామూళ్ల మత్తు.. సారాబట్టీలకు దాష్టీకం
- స్థానిక బంధుత్వాలతో గుట్టుగా దందా
- ఐదేళ్లు దాటినా పైరవీలకు ప్రయత్నాలు

రాజానగరం, సెప్టెంబరు 1 : పోలీస్ శాఖలో ఉన్నతస్థాయి అధికారుల బదిలీలు అలవోకగా సాగిపోతున్నాయి. ఏడాదికి ఒకరిద్దరు ఎస్ఐలు మారుతున్నారు. అయితే కానిస్టేబుళ్ల మాత్రం అక్కడే పాతుకుపోతున్నారు. ఏళ్ల తరబడి ఒకటే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ వదిలి వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన సిబ్బందిలో కొంత మంది తమ బదిలీల సమయం పూర్తయినప్పటికీ ఇతర స్టేషన్‌లకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో అవినీతి ఆరాచకాలకు అలవాటు పడిన సిబ్బంది ఇప్పుడు కూడా అదే దందాలను కొనసాగించే పనిలో పడ్డారు. రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పైబడిన కానిస్టేబుళ్ల అనేక మంది ఉన్నారు. వీరు మామూళ్లకు అలవాటు పడి మళ్లీ మామూలుగానే కొనసాగేందుకు పైరవీలు కొనసాగిస్తున్నారు. గతంలో వైసీపీ నాయకులకు తప్ప ఇతర పార్టీల నాయకులకు కనీస గౌరవం ఇవ్వని సిబ్బంది ఇప్పుడు కూటమి నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఎలాగైనా సరే ఇక్కడి నుంచి కదలకుండా ఉండేలా సిఫార్సుల కోసం భారీ మొత్తంలో చేతులు తడిపేందుకు ఎవరి ప్రయత్నాలు వారు సాగిస్తున్నారు. వీరిలో కొంత మంది ఉన్నతాధికారులను సైతం తప్పుదారి పట్టిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. నాటు సారా బట్టీలు, పేకాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలను నిరోధించే క్రమంలో భాగంగా అధికారులు చేపట్టే చర్యలను ముందుగానే అక్రమ వ్యాపారులకు సమాచారం చేరవేస్తున్నారనే అపవాదు లేకపోలేదు. చాలా గ్రామాల్లో నాటు సారా తయారీ కుటీర పరిశ్రమగా మారడం వెనుక స్టేషన్‌లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది అందిస్తున్న సహాయ సహకారాలేనని పలువురు చెప్పుకొంటున్నారు. అలాగే హైవే వెంబడి కొనసాగుతున్న వ్యభిచార స్థావరాల్లో కూడా పోలీసుల ప్రమేయం ఉన్నట్టు సమాచారం. వేశ్యల వద్దకు వచ్చే విటులను భయభ్రాంతులకు గురిచేసి వారి జేబుల్లో ఉన్న సొమ్మును అందిన కాడికి దోచుకున్న సందర్భాలు అనేకం. ఇటువంటి కార్యకలాపాల్లో స్టేషన్‌లో రికార్డులు నిర్వహించే సిబ్బందిలో ఒకరు కీలకంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ద్వారా తెలిసింది. ఇప్పటికీ సదరు వ్యక్తి స్టేషన్‌లో పెత్తనం చెలాయిస్తూ పోలీసు వ్యవస్థకు మచ్చతెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు.కొంత మంది కానిస్టేబుళ్ల ఇక్కడే బంధుత్వాలు పెంచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.ఇటీవల సీఐగా బాధ్యతలు చేపట్టిన ప్రసన్న వీరయ్య గౌడ్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై కన్నేసి ఉంచాలని ప్రజలు విన్నవించుకుంటున్నారు. వచ్చే బదిలీల్లో రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లను సాగనంపితేనే ప్రక్షాళన జరుగుతుందని అంటున్నారు.

జ్వరం కేసు వస్తే పరీక్షించండి : డీఎంహెచ్‌వో

దివాన్‌చెరువు, సెప్టెంబరు 1 : ప్రతీ జ్వర కేసుకు పరీక్షలు తప్పక నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. రాజానగరం మండలం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో పాలచర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారామెడికల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి శిబిరానికి రోగులు హాజరయ్యేవిధంగా చూడాలన్నారు. అన్ని సీజనల్ కేసులకు చికిత్స చేయాలని చెప్పారు. రాబోయే 10 రోజులల్లోపు ప్రసవ తేదీలు ఉన్న గర్భిణుల జాబితాలను నిశితంగా పరిశీలించాలని చెప్పారు. వారికి సురక్షితమైన ప్రసవాలు జరిగేలా నిర్దేశించిన ప్రభుత్వ ఆసుపత్రులకు మార్చడానికి ఏర్పాట్లు చేయడంతో సహా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి ఆరోగ్యవిద్యను అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ తదితరులు పాల్గొన్నారు.

వదలని..వరుణుడు

- జిల్లాలో మోస్తరు వాన
- సరాసరి 446.0 మి.మీ వర్షం
- గట్లను పరిశీలించిన కలెక్టర్
- అధికారులకు ఆదేశాలు
- 15 కమాండ్ కంట్రోల్ టీమ్‌లు
- శిథిలావస్థకు చేరిన హాస్టళ్లు
- సురక్షిత భవనంలోకి విద్యార్థులు
- పలు ప్రాంతాలకు బస్‌లు రద్దు
- నేడు బడులకు సెలవు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 1 : వరుణుడు వదల్లేదు.. చెదురుమదురుగా వస్తూనే ఉన్నాడు..అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.ఆదివారం గడచిన 24 గంటల్లో సరాసరి 446.0 మి.మీల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. జిల్లాలో పెరవలి మండలంలో అత్యధికంగా 46.6 మి.మీ.. అత్యల్పంగా కోరుకొండలో 5.8 మి.మీ వర్షం పడింది. గోకవరంలో 46.2 మి.మీ, నల్లజర్లలో 33.6, దేవరపల్లి 33.2, తాళ్లపూడి 27.0, గోపాలపురం 26.0, చాగల్లు 23.4, అనపర్తి 22.8, బిక్కవోలు 21.8, సీతానగరం 22.8, నిడదవోలులో 21.2, రాజానగరం 19.8, రాజమహేంద్రవరం 18.6, కడియం 16.2, ఉండ్రాజవరం 16.6, రంగంపేటలో 15.0, కొవ్వూరులో 15.2, రాజమహేంద్రవరం రూరల్‌లో 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



22 కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో భారి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలను కలెక్టర్ పి.ప్రశాంతి అప్రమత్తం చేశారు. ఇప్పటికే 19 మండలాల పరిధిలో 22 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. తాజాగా ఆదివారం కలెక్టరేట్‌లో 15 శాఖలతో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం నిఘాపెట్టిఉంచారు. కలెక్టర్ ఆదివారం జిల్లాలో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.భారీ వర్షాలు పడితే జరిగే పరిణామాల నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన పనులకు విద్యుత్,వైద్యఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.చెరువు, కాలువ గట్లు పటిష్టతకు ఇరిగేషన్ అధికారులను సన్నద్ధం చేశారు.

హాస్టల్ విద్యార్థుల తరలింపు..

కోరుకొండ, సెప్టెంబరు1 : శిథిలావస్థకు చేరి న హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనాల్లోకి తరలించాలని జేసీ చినరాముడు అధికారులను ఆదేశించారు.కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం అధికారులతో సమీక్షించారు. కాపవరం గ్రామంలో పర్యటించి శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం స్లాబును పరిశీలించారు.క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 26 మంది బాలికలను సురక్షిత భవనంలోకి తరలించినటుట్ల అధికారులకు తెలిపారు. ఈ పంటన వె హా ద ు క ు సెప్టెంబరు 15వ తేదీ వరకు మాత్రమే సమయం ఉందని జేసీ తెలిపారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, తహశీల్దార్ వి.నుస్వాగతం, వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, ఎంపీడీవో నరేష్‌కుమార్, ఏవో గౌరీదేవి తదితరులు ఉన్నారు.



హాస్టల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ చిన్నరాముడు

నేడు విద్యాసంస్థలకు సెలవు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)/కోరుకొండ: వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థలకు సోమవారం(నేడు) సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అధిక వర్షపాతం ఉం టుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, అగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈవో వాసుదేవరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ పాఠశాలలు తెరిస్తే గుర్తింపు రద్దుకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. వర్షం వల్ల శనివారం సెలవు ప్రకటించినప్పటికీ అక్కడక్కడా ప్రైవేట్ పాఠశాలలు పనిచేసినట్టు కలెక్టర్ దృష్టికి ఫిర్యాదులువచ్చాయన్నారు. సోమవారం ఇటువంటి ఫిర్యాదు వస్తే సంబంధి త యాజమాన్యాలపై చర్యలు తప్పవన్నారు. సోమవారం జరగాల్సిన సెల్ ఎసెస్‌మెంట్ పరీక్షలను ఈ నెల 9న వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

ఒక్క ఎకరా ముంపునకు గురికాకూడదు : కలెక్టర్

దేవరపలి, సెప్టెంబరు 1 : అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. దేవరపల్లి మండల కురుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్న బర్లవాగును ఆదివారం పరిశీలించారు.ప్రతి ఏటా బర్లవాగు వల్ల వేలాది ఎకరాల్లో పంట ముంపున కు గురవుతుందని రైతులు, గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. బర్లవాగుపై ఐదు చోట్ల గతంలో భారీ వర్షాల వల్ల గండ్లుపడ్డాయని ఇరిగేషన్ ఏఈఈ రాహుల్ భాస్కర్ తెలిపారు. యుద్ధప్రతిపాదికన గండ్లు పూడ్చాలని ఒక్క ఎకరా కూడా ముంపునకు గురికాకూడదని కలెక్టర్ ఆదేశించారు.

ఏటిగట్లు పటిష్టం చేయండి



దేవరపల్లి మండలం కురుకూరులో బర్లవాగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు, సెప్టెంబరు 1 : బలహీనంగా ఉన్న ఏటిగట్లను పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి నిడదవోలు మండలం కంసాలిపాలెంలో ఏటిగట్లను ఆదివారం పరిశీలిం చారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు మూడు రోజుల్లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువలలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని బలహీనంగా ఉన్న గట్లు వద్ద తగిన రక్షణ చర్యలు చేపట్టాల న్నారు. ఇసుకబస్తాలు వేయాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పునరావాసకేంద్రాలకు తరలించేం దుకు తగిన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. కంసాలిపాలెంలో బలహీనంగా ఉన్న గట్ల వద్ద రక్షణగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు.

విజయవాడకు ఐదు ఆర్టీసీ సర్వీసులు రద్దు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 : ఎడతెరిపిలేని వర్షాల నేపథ్యంలో ఆదివారం ఆర్టీసీ జిల్లా అధికారులు పలు సర్వీసులను రద్దు చేశారు. ప్రధానమైన విజయవాడ రూటులో ఐదు బస్సు సర్వీసులను రద్దు చేశారు. భద్రాచలం రూటులోనూ బస్సులను నిలిపివేశారు. రాజమహేంద్రవరం-విజయవాడ రూటులో షెడ్యూలు మేరకు ప్రతిరోజూ అప్ అండ్ డౌన్‌లో ఏడు సర్వీసులు నడుస్తుంటాయి. వీటిలో ఐదు సర్వీసులు నిలిపివేశారు. రాజమహేంద్రవరం డిపో అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఐదు సర్వీసులను ఒక్కసారిగా రద్దు చేయడంతో విజయవాడ రూటులో రాకపోకలు సాగించే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. విజయవాడ సమీపంలోని హనుమాన్ జంక్షన్‌లో రోడ్లపైకి భారీ ఎత్తున నీరు చేరిందనే సమాచారంతో సర్వీసులను అప్పటికప్పుడు రద్దు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం, గోకవరం డిపోల నుంచి మారేడుమిల్లి, చింతూరు మీదుగా వెళ్లే ఆర్టీసీ సర్వీసులను సైతం నిలివేశారు. ఈ రూటులో రాజమహేంద్రవరం డిపో నుంచి తెల్లవారుజామున ఒక బస్సు నడుపుతున్నారు. గోకవరం డిపో నుంచి మూడు సర్వీసులు నడుస్తున్నాయి. వర్షాల కారణంగా వీటిని నిలివేశారు.

తిరుమల ప్రయాణం వర్షార్పణం



తిరుమల ప్రయాణం వర్షార్పణమైంది. గన్నవరం వద్ద రైల్వే ట్రాక్‌పై వరద నీటి ప్రవాహం కారణంగా రైలు రాజమహేంద్రవరం వచ్చేసరికి కాకినాడ- రేణిగుంట ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు చేశారు. - 7లో



చినశంకర్లపూడిలో ఇండియన్ ఈగల్ ఓవెల్

ప్రత్తిపాడు/ఏలేశ్వరం, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా చినశంకర్లపూడిలో చెనుబోయిన వేణు ఇంటి వద్ద అరుదైన పక్షి కనిపించింది. కోతులు దాడి చేయడంతో స్వల్పంగా గాయపడి ఎగురలేని స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు ఏలేశ్వరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఏలేశ్వరం డీఆర్వో శ్యాంసన్ వచ్చి ఈ పక్షిని స్వాధీనం చేసుకున్నారు. గుడ్లగూబ, గ్రద్ధ మాదిరిగి కనిపిస్తున్న ఈ పక్షి శాస్త్రీయ నామం ఇండియన్ ఈగల్ ఓవెల్ అని ఆయన చెప్పారు. బెంగాల్ అటవీ ప్రాంతంలో ఈ జాతి పక్షులు కనిపిస్తాయని, మన రాష్ట్రంలో కనిపించడం అరుదన్నారు. నీరసంగా ఉండడంతో ఎగురలేకపోతోందని, ఆహారం సమకూర్చి ఎగిరే వరకు విశ్రాంతి కల్పిస్తామన్నారు. చెప్పారు. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ పక్షిని పంజరంలో భద్రపరిచి ఏలేశ్వరంలోని అటవీ సందర్శన కార్యాలయానికి తరలించారు. అక్కడ వైద్యం చేసి లింగంపర్తి అడవిలో విడిచిపెట్టారు.



మూడు పతకాలు సొంతం చేసుకున్న మధు చందన

మధు చందనకు పతకాల పంట

చింతూరు, సెప్టెంబరు 1: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన మధు చందన వెయిట్ లిఫ్టింగ్‌లో ఏక కాలంలో మూడు పతకాలు కైవసం చేసుకుంది. చింతూరు కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న మధుచందన అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. ప్లస్-81 కేటగిరీ జూనియర్ విభాగంలో బంగారు పతకం, సబ్ జూనియర్ విభాగంలో రజత పతకం, సీనియర్ విభాగంలో రజత పతకం సాధించింది.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

భర్త, తోటి కోడలికి గాయాలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో విద్యుత్ షాక్‌తో ఆదివారం ఒక మహిళ మరణించగా, భర్త, తోటికోడలికి గాయాలయ్యాయి. గ్రామంలోని రాణా వారి వీధిలో నివాసముంటున్న పోలవరపు నూకరత్నం(55) ఇంటిలో తడిసిన బట్టలను ఆరేస్తోంది. ఆ సమయంలో ఆ తీగకు కరెంటు ప్రవహించడంతో విద్యుత్ షాక్‌కు గురయింది. వెంటనే నూకతర్నం కేకలు వేయడంతో భర్త నారాయణరావు, తోటి కోడలు సత్యవతి వచ్చి ఆమెను కాపాడే ప్రయత్నం చేస్తుండగా వారు కూడా షాక్‌కు గురయ్యారు. వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నూకరత్నం మరణించింది. మిగిలిన వారు చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

అయినవిల్లి మండలం సిరిపల్లిలో...

అయినవిల్లి, సెప్టెంబరు 1: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిసా రాష్ట్రం నబుగాన్ నవరంగ్‌పూర్ జిల్లా కారగాన బార్‌జాన్ గ్రామానికి చెందిన బలరాం హరిజన్ (22) ఏపీలోని కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం సిరిపల్లికి చెందిన వాసంశెట్టి గిరిధర్ రొయ్యల చెరువు వద్ద పని చేస్తున్నాడు. హరిజన్ శనివారం రాత్రి జనరేటర్ వేశాడు. కరెంటు రావడంతో జనరేటర్ నిలుపుదల చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావమరిది దులార్ హరిజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కేఎం జోషి తెలిపారు.

కూనవరం మండలం మర్రివీడులో...

కూనవరం, సెప్టెంబరు 1: మండలంలోని మర్రివీడుకు చెందిన ఆవుల వెంకటరమణ (28) ప్రయివేటుగా విద్యుత్ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఓ ఇంట్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై పడిపోయాడు. కోతులగుట్ట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

కాలు జారి చెరువులో పడి యువకుడు మృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 1: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనబాద్ఎస్సీ పేటకు చెందిన కాకాడ లోవరాజు(29) పెయింటింగ్‌లు వేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం కాళ్లు కడుక్కోవడానికి చెరువులోకి దిగి కాలు జారిపడ్డాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు పూర్తిగా నిండిపోయింది. ఈత రాకపోవడంతో లోవరాజు ఊపిరాడక మృతి చెందాడని అతడి మేనమామ పలివెల నానిబాబు తెలిపారు. మృతుడికి సంవత్సరంలోపు పాప ఉందని, భార్య ఆరో నెల నెల గర్భిణి అని ఆయన చెప్పారు.

వర్షం కారణంగా తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఆటంకం ఏర్పడింది. గన్నవరం వద్ద రైల్వే ట్రాక్ నీట మునగడంతో కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలును రాజమహేంద్రవరంలో రద్దు చేశారు. రైల్వే అధికారుల ఆకస్మిక నిర్ణయంతో దారి మధ్యలోనే ప్రయాణం ఆగిపోవడంతో ప్రయాణికులు ఉసూరుమన్నారు.



నిలిచిపోయిన తిరుపతి రైలు... వెనుదిరుగుతున్న ప్రయాణికులు

తిరుపతి రైలు ఆకస్మిక రద్దు

- రాజమహేంద్రవరంలో నిలిపివేత
- 1,500 మంది ప్రయాణికుల ఆగచాట్లు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి రేణిగుంట (తిరుపతి) వెళ్లే రైలు కాకినాడలో ఆదివారం సాయంత్రం బయల్దేరింది. ఐదు గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంది. ఎంతసేపటికీ బయలుదేరకపోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన మొదలైంది. రైలును దారి మళ్లిద్దామనుకుని తాడేపల్లిగూడెం, ఏలూరు వెళ్లే ప్రయాణికులు దిగిపోవాలని చెప్పారు. కానీ రైలును రద్దు చేస్తున్నట్టు 6.30 గంటల సమయంలో ప్రకటించారు. 11 స్లీపరు, 6 ఏసీ, రెండు జనరల్ బోగీల్లో సుమారు 1,500 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో 90 శాతం మంది తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళ్లేవారే. రైలు ఆకస్మిక రద్దు ప్రకటనతో దర్శనం కోల్పోయామనే బాధ ప్రయాణికుల్లో కనిపించింది. కొందరు రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. టీసీఐ చంద్రమౌళి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధించినట్లే రైలును ఆకస్మికంగా దారి మధ్యలో నిలిపేస్తే తమకూ పరిహారం చెల్లించాలని వాదించారు.

రిఫండ్‌కీ ఇబ్బందే...

మాన్యువల్‌గా రిజర్వేషను టికెట్లు తీసుకున్న వాళ్లు రిఫండ్ కోసం రిజర్వేషను కౌంటర్ల వద్దకు వెళ్లాలని సిబ్బంది సూచించారు. అయితే అక్కడ మూడే కౌంటర్లు ఉండడం, రాజమండ్రి రిజర్వేషను కార్యాలయంలో



రిజర్వేషను రద్దు డబ్బుల కోసం ప్రయాణికుల పాట్లు

తీసుకున్న టికెట్లను మాత్రమే రద్దు చేస్తామని చెప్పడంతో ప్రయాణికులు మరింత నీరసించిపోయారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి ఘోరం. తిరుగు ప్రయాణంలో టికెట్లు ఉన్నవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఆ టికెట్లకు క్యాన్సిలేషన్ చార్జీలు వసూలు చేయకుండా చూడాలని కోరారు.

సేవ కోల్పోయాం: రోహిణి, కాకినాడ



వేంకటేశ్వరుడి సేవకు తొమ్మిది నెలలుగా ప్రయత్నిస్తే ఇప్పుడు అవకాశం లభించడంతో జన్మ ధన్యమైందని సంబరపడ్డాం. 15 మంది బృందంగా బయల్దేరాం. సోమవారం ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాల్సి ఉంది. కానీ దారి మధ్యలో ఆగిపోయాం. మళ్లీ ఐదు నెలల దాకా మాకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. దారి మళ్లించి అయినా తీసుకెళితే బాగుండేది.

ఎటు వెళ్లాలో తెలియట్లేదు



వీవీ సత్యనారాయణ, రామచంద్రపురం

ఎప్పటి నుంచో తిరుమల వెళ్లాలని అనుకుంటున్నాం. దర్శనం, వసతి దొరకలేదు. జూన్ 24న దొరికాయి. సోమవారం దర్శనం ఉంది. కానీ రైలును అకస్మాత్తుగా ఆపేశారు. ఇక్కడి నుంచి వెనక్కి వెళ్లాలో తిరుపతి వెళ్లాలో తెలియట్లేదు. భార్య, బిడ్డలతో ఇబ్బంది పడుతున్నాం. ముందుగా సెల్‌ఫోన్‌కి మెసేజ్ పంపిస్తే కొంత ఇబ్బంది ఉండేది కాదు.

కొన్ని రద్దు... మరికొన్ని దారి మళ్లింపు

రైలు ప్రయాణికులకు తప్పని అవస్థలు



సామర్లకోట రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

సామర్లకోట, సెప్టెంబరు 1: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైల్వే శాఖ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. సామర్లకోట మీదుగా అటు విశాఖ ఇటు విజయవాడ రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను నిర్దేశిత రూట్లలో కాకుండా వేరే రూట్లకు డైవర్షన్ చేశారు. రైల్వే ఎస్టీఎం చార్జ్ అధికారి రాజనరసు కార్యాలయం నుంచి సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు ఆదివారం మధ్యాహ్నం ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి సామర్లకోట చేరుకోవాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముందుగా రిజర్వేషన్ టిక్కెట్లు పొందిన వారికి చార్జీలను వాపసు చేశారు. రైళ్ల రాకపోకలకు చెంది ప్రత్యేక సమాచారం అందించేందుకు ప్లాట్‌ఫామ్-1పై హెల్ప్ లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు. ఆదివారం రద్దు అయిన రైళ్ల వివరాలు....

హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే గోదావరి ఎక్స్‌ప్రెస్.
విశాఖ-హైద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే గోదావరి ఎక్స్‌ప్రెస్.
లింగంపల్లి-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-ఎల్‌టీటీ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
విశాఖ-మహబూబ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
కాకినాడ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
లింగంపల్లి-కాకినాడ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
సికింద్రాబాద్-భువనేశ్వర్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్.
భువనేశ్వర్-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 7న రద్దు చేశారు.

టాటానగర్-యశ్వంత్‌పూర్ మధ్య రాకపోకలు సాగించే వారాంతపు ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు. ఎగువ ప్రాంతా ల్లో కురిసిన భారీ వర్షాలకు రైల్వే ట్రాక్ నీటి ముంపు కారణంగా సిగ్నలింగ్ వ్యవస్థ సక్రమంగా పనిచేయలేదు. అటు విజయవాడ, ఇటు విశాఖ నుంచి పలు రైళ్ల రాకపోకల్లో గంటల తరబడి ఆలస్యం జరిగింది. కొన్ని రైళ్లను నిర్దేశిత వేగం కన్నా తగ్గించి నడుపుతుండడంతో పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. సామర్లకోటలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌లో ముగ్గురు సిబ్బందిని నియమించి నిరంతరం సమాచారం అందించేందుకు 0884-2327010 నంబరు కేటాయించారు.

విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆదివారం రాత్రి 7.02 గంటలకు సామర్లకోట చేరుకుంది. నూజివీడు-విజయవాడ మధ్య ట్రాక్ ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో సామర్లకోటలో 2.20 గంటల పాటు నిలుపుదల చేశారు. రాత్రి 9.27 గంటలకు తిరిగి విశాఖపట్నం పంపించారు.



ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. అధిక వర్షాలతో కాలువల ద్వారా వరద నీరు సముద్రంలోకి పోటెత్తుతోంది. కెరటాలు బీచ్ రోడ్డును తాకుతున్నాయి. గత రెండు రోజులుగా వాతావరణం అనుకూలించకపోవడంతో మత్స్యకారులు వేటను స్వచ్ఛందంగా విరమించారు.



చింతూరు-వరరామచంద్రపురం మండలాల మధ్య ముకునూరు వద్ద ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు

పొంగిపొర్లిన వాగులు

పరిస్థితిని సమీక్షించిన ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు, సెప్టెంబరు 1: ఒకపక్క ఎడతెరపిలేని వర్షం... మరోపక్క ఉధృతంగా గోదావరి, శబరి నదులు... ఇంకోపక్క పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలాన్ని వరద చుట్టుముట్టింది. కల్లేరు, పెద్దసీతనపల్లి, ముకునూరు, రామన్నపాలెం, ఎజికొడేరు పంచాయతీల పరిధిలోని 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. సోకిలేరు, చీకటి వాగులు పొంగి ప్రవహిస్తుం డడంతో చింతూరు, వరరామచంద్రపురం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం 35.5 అడుగులకు చేరింది. వరద పరిస్థితిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ సమీక్షిస్తున్నారు. సోకిలేరు, చీకటివాగు ఉధృతిని ఆయన స్వయంగా పరిశీలించారు. చింతూరు నుంచి ఎజికొడేరు వెళ్లే ఆదివాసీలు జల్లివారిగూడెం వద్ద వాగు దాటేందుకు పడుతున్న అవస్థలను చూశారు. అప్పుడే పెరుగుతున్న వాగు మీదుగా వారందరినీ తన వాహనంలో దాటించారు. ఘాట్‌పై కొండచరియలు, చెట్లు విరిగిపడే ప్రమాదముందన్న కారణంతో రాత్రి సమయంలో చింతూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



తుమ్మిరిగూడెం వాగు వద్ద ఆదివాసీలను తన వాహనంలో దాటిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్



రాజానగరంలో డిజిటల్ క్లాస్ రూమ్‌గా రూపుదిద్దుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రం



పిఠాపురానికి మొక్కలు పంపుతున్న శివ

అభిమానం నిండుగా... అభివృద్ధికి అండగా..

- పవన్‌కల్యాణ్ అభిమానుల వినూత్న ఆలోచన
- రాజానగరం అంగన్‌వాడీ కేంద్రానికి డిజిటల్ మెరుగులు
- 'క్లీన్ పిఠాపురం... గ్రీన్ పిఠాపురం' కార్యక్రమానికి కడియం నుంచి మొక్కలు

రాజానగరం/కడియం, సెప్టెంబరు 1: తమ అభిమాన హీరో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన యువకులు వినూత్నంగా ఆలోచించారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా నడుచుకుందామనుకున్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నా కొందరు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకపోవడాన్ని గుర్తించారు. చిన్నారులను ఆకర్షించేలా స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి డిజిటల్ మెరుగులు అద్దాలని సంకల్పించారు. తమలో ఒకరైన ఎన్ఆర్ఐ స్నేహితుడితో ఆ ఆలోచనను పంచుకున్నారు. పుట్టినరోజు వేడుకలకు చేసే రూ.50వేల ఖర్చుతో డిజిటల్ తరగతి గది రూపకల్పనకు అవసరమైన డిజిటల్ పరికరాలు, ఆటబొమ్మలు సమకూర్చారు. సోమవారం దీనిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో ప్రారంభింపచేసేందుకు సిద్ధం చేశారు.

కడియం నుంచి చిరు సేవా సమితి అధ్యక్షుడు, జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ గెడ్డం శివరత్నగణపతి రూ.4 లక్షలు విలువ చేసే 12వేల మొక్కలను ఉచితంగా అందజేశారు. రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ తలపెట్టిన వన మహోత్సవంలో భాగంగా 'క్లీన్ పిఠాపురం.. గ్రీన్ పిఠాపురం' కార్యక్రమానికి ఫల, అటవీ శాఖ మొక్కలు పంపుతున్నట్టు శివ వివరించారు.

మరో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటున్న తల్లిదండ్రులు
- పలు కారణాలు చెప్తున్న వైద్యులు

చింతూరు, సెప్టెంబరు 1: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో ఆదివారం ఆరు రోజుల వయసు గల మరో శిశువు మృతి చెందింది. సరివెలకు చెందిన కణితి చిలకమ్మకు ఆగస్టు 27న పురిటి నొప్పులు రావడంతో వెంటనే ఆమె భర్త దుర్గారావు, అత్త లక్ష్మి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చిలకమ్మ ఆదే రోజు మగ శిశువుకు జన్మనిచ్చింది. 30న శిశువు కడుపు ఉబ్బుగా ఉందని గుర్తించిన వైద్యులు ప్రత్యేక వార్డులోకి మార్చారు. మరుసటి రోజు కూడా బిడ్డ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో వైద్యులు ఆది వారం రాత్రి పదకొండు గంటల సమయంలో మెరుగైన చికిత్స అవసరమని భావించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాత్రంతా ప్రత్యేక వార్డులో ఉంచిన అక్కడి వైద్యులు ఆదివారం ఉదయం శిశువు పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ తరలించాల్సిందిగా తల్లిదండ్రులకు సూచించారు. అయితే వర్షాల కారణంగా భద్రాచలం నుంచి వరంగల్ వెళ్లేందుకు రహదారి సౌకర్యం సక్రమంగా లేదని తెలుసుకున్న తల్లిదండ్రులు తమ బిడ్డను హైదరాబాద్ తరలించేందుకు సిద్ధపడి అంబులెన్సు సిద్ధం చేసుకున్నారు. ఈలోపు బిడ్డ మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై తల్లిదండ్రులు మాట్లాడుతూ చింతూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు తమ బిడ్డ ఆరోగ్య పరిస్థితిని సకాలంలో గుర్తించకపోవడంతో చికిత్స చేయించే సమయం దొరక్క మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. ముందుగానే చెప్పి వుంటే ఎంతైనా ఖర్చు చేసి తమ బిడ్డను బతికించుకునేవాళ్లమంటున్నారు.

ఈ విషయమై వైద్యుడు ఉమర్ వివరణ ఇస్తూ... బిడ్డకు పచ్చకామెర్లు, జ్వరంతో పాటు మలద్వార నిర్మాణం సక్రమంగా లేదన్నారు. మలం బయటకు వెళ్లే చోట ఆటంకం కలిగి మృతి చెందిందన్నారు.





మృతి చెందిన శిశువు, మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు చిలకమ్మ దుర్గారావు, నానమ్మ లక్ష్మి




పంపా వరద గేట్ల నుంచి కిందికి ప్రవహిస్తున్న నీరు

పంపా రిజర్వాయరు నుంచి 2వేల క్యూసెక్కులు సముద్రంలోకి

అన్నవరం, సెప్టెంబరు 1: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కు ఎగువ ప్రాంతాల నుంచి పంపా రిజర్వాయరుకు నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో రెండో నంబరు వరదగేటు ద్వారా 2వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాల పంట పొలాలు మునిగిపోయాయి. మరోపక్క వరద నీటి ప్రవాహం జాతీయ రహదారిపై ఉన్న నూతన నమూనాలయం వద్దకు చేరడంతో చుట్టూ ప్రహరీ నీటితో నిండిపోయింది. దీంతో జాతీయ రహదారిపైకి వరద నీరు ప్రవహించే అవకాశం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. దీంతో జాతీయ రహదారిపై ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పంపా నీటిమట్టం 99 అడుగులు ఉంది.



జాతీయ రహదారిపై నమూనాలయం ప్రహరీ చుట్టూ నీరు



రాత్రి వేళ తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డు మూసివేత

మోతుగూడెం, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీ తులసిపాక నుంచి మారేడుమిల్లి వెళ్లే ఘాట్ రోడ్డును మూసివేస్తున్నట్టు మోతుగూడెం ఎస్‌ఐ జి.గోపాలరావు తెలిపారు. కొండచరియలు విరిగిపడే అవకాశం వున్న నేపథ్యంలో ఈ ఘాట్ రోడ్డులో వాహనాలను అనుమతించమన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

అత్తను చంపిన కోడలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 1: మండలంలో వృద్ధురాలైన అత్తను కోడలు హతమార్చింది. రాజవొమ్మంగి సీఐ సన్యాసి నాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... కొండపల్లి గ్రామనికి చెందిన ఈక లక్ష్మి(65)ని ఆమె కోడలు జ్యోతి హత్య చేసింది. నిత్యం తనకు అక్రమ సంబంధాలు అంటకడుతోందనే కోపంతో జ్యోతి అత్త లక్ష్మిని బలంగా కొట్టడంతో చనిపోయింది.

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం



వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన గొల్లగూడెం రహదారి

ఏజెన్సీలో కుండపోత

ఎటపాక, సెప్టెంబరు 1: మండలంలో శనివారం అర్ధరాత్రి కుండపోతగా వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజాము వరకు వీడలేదు. టీపీవీడు పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. ఆదివారం ఉదయం నుంచీ ఈ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. కొత్తూరు, కృష్ణవరం గ్రామాల్లో పత్తి చేలు నీట మునిగాయి. మరికొన్ని చోట్ల పత్తి పంట కొట్టుకుపోయింది. కృష్ణవరం శివారులోని కల్వర్టు ప్రాంతం వద్ద రహదారిపై నడుము లోతు వరద నీరు ప్రవహించింది. అచ్యుతాపురం వద్ద ఉన్న అలుగు వాగు ప్రాజెక్టు పొంగి పొర్లింది. భారీ వర్షానికి గన్నవరం గ్రామంలో కరి సరోజిని తాటాకిల్లు కూలిపోయింది. కృష్ణవరంలో గ్రామంలో కూరం రంగయ్య తాటాకిల్లు కుంగి పక్కకు వాలిపోయింది.



ఎటపాక మండలం కొత్తూరులో దెబ్బతిన్న పత్తి పంట



ఎర్రంపాడు-వట్టిగెడ్డ రోడ్డుపై వాగును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

ఉప్పొంగిన వాగులు

రాకపోకలు బంద్... 50 ఎకరాల్లో నీట మునిగిన వరి పంట

రాజవొమ్మంగి, సెప్టెంబరు 1: మండలంలోని నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి, రాజవొమ్మంగి-శాంతినగర్,మొల్లిమెట్ల-లాగరాయి, వట్టిగెడ్డ-ఎర్రంపాడు మధ్య కాజ్‌వేలపై వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 25 గ్రామలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరుకుంపాలెం గ్రామ శివారులో వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఎంపీటీసీ మీనవల్లి సుబ్బరావు రహదారిపై ఉండి వాహనచోదకులకు సూచనలు చేశారు. జడ్డంగి శివారులో సుమారు 50 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. చెరువును తలపించేలా పొలాలు మునిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

రాజవొమ్మంగి మండలంలో వట్టిగెడ్డ-ఎర్రంపాడు గ్రామాల మధ్య కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు వాగుల వద్ద నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్లప్పుడు మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తహసీల్దారు కరక సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, సీఐ సన్యాసి నాయుడు, డిప్యూటీ తహసీల్దారు అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.



చెరుకుంపాలెం గ్రామ శివారులో రోడ్డుపై వరద నీరు

వాగులు, కాల్వల వద్దకు వెళ్లకండి

రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్



దేవీపట్నం, సెప్టెంబరు 1: మండలంలోని వెలగపల్లి రహదారిలో వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీశ్ అడహల్లి ఆదివారం ఈ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంతెన పైనుంచి ఎవరూ ప్రయాణించకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. వంతెనకు ఇరువైపులా వాహనాల రాకపోకలు జరగకుండా చెక్క దుంగలు పెట్టించామన్నారు. వాగులు, కాల్వలు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వాటి వద్దకు ఎవరూ వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

కూనవరంలో 12 సెం.మీ. వర్షం



శబరి బ్రిడ్జి వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

కూనవరం: మండలంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో కూనవరంలో 12 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ప్రజల రాకపోకలు స్తంభించాయి. వాహనాలు సైతం ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ మండలంలో పర్యటించారు. శబరి-గోదావరి సంగమం వద్ద వరద ఉధృతిని పరిశీలించారు.

పర్యాటక ప్రదేశాలను మూసివేస్తున్నాం: చింతూరు డీఎఫ్‌వో బబిత

మోతుగూడెం, సెప్టెంబరు 1: చింతూరు అటవీ డివిజన్ పరిధిలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాల్లో వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో లక్కవరం రేంజ్ పరిధిలోని పొల్లూరు జలపాతం, సోకిలేరు వ్యూపాయింట్, పుష్ప షూట్, ధారాలమ్మ పిక్నిక్ స్పాట్‌లతో పాటు ఇతర సందర్శన ప్రదేశాలను మూసివేసినట్టు చింతూరు డీఎఫ్‌వో బబిత తెలిపారు. వాగులు, వంకలు, జలపాతాలను సందర్శించడానికి పర్యాటకులు వచ్చి ఇబ్బందులకు గురికావద్దని కోరారు.

ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ



చింతూరు, సెప్టెంబరు 1: చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందుతున్న తీరును ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల హాజరుపై ఆరా తీశారు.

చెరువులకు వేలం ఎప్పుడు?



చినకొండేపూడిలోని ముత్యాలమ్మ చెరువు

- నిరుపయోగంగా వదిలేసిన ఆర్థిక వనరు
- పంచాయతీ ఆదాయానికి గండి
- నీరు-చెట్టు, 'ఉపాధి హామీ'తో అభివృద్ధి
- ఆక్రమణలకు గురవుతున్న వైనం

సీతానగరం, సెప్టెంబరు 1: గ్రామాల్లోని పంచాయతీ చెరువులకు కొన్నేళ్లుగా వేలం నిర్వహించపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతోంది. అంతేగాక చెరువులపై పర్యవేక్షణ కొరవడడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. సీతానగరం మండలం చినకొండేపూడి పంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ చెరువు, చింతల చెరువులకు వేలం పాటలు లేకపోవడంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఏటా రూ.3 నుంచి 4 లక్షల వరకు ఆదాయాన్ని పంచాయతీ కోల్పోతోంది. ఇదీగాక 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముత్యాలమ్మ చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. ఈ ముత్యాలమ్మ చెరువుకు నీరు చెట్టు కార్యక్రమంలో భాగంగా పంచాయతీ తీర్మానంతో రూ.3 లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ చెరువుకు ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు చేపడుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.6,52,777, 2023-24లో రూ.8,93,726 వ్యయంతో పనులు నిర్వహించారు. ఇంత ఖర్చుచేసిన చెరువుకు మాత్రం వేలం పాట పెట్టకుండా వదిలేయడంతో ఏడాదికి సుమారు రూ.3 లక్షలు చొప్పున ఆరేళ్లుగా రూ.18 లక్షల ఆదాయాన్ని పంచాయతీ నష్టపోయింది. ఇది కాకుండా పంచాయతీ పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గురవుతోంది. అసలే పంచాయతీలకు ఆదాయం పడిపోయింది. అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలుగుతున్నా కనీసం ఆర్థిక వనరులు అందించే చెరువులను నిర్లక్ష్యంగా వదిలేసి పంచాయతీ ఆదాయానికి గండిపడుతున్నా పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆదాయం మాత్రం సున్నా. అధికారులు స్పందించి చినకొండేపూడిలోని చెరువులకు వేలం నిర్వహించి పంచాయతీ ఆదాయానికి బాటలు వేయాలని పలువురు కోరుతున్నారు.

14 ఎకరాలకు 10 ఎకరాలే ఉంది

చెరువు వేలం విషయమై చినకొండేపూడి పంచాయతీ కార్యదర్శి ముదునూరి సత్యవేణిని వివరణ కోరగా తాను పంచాయతీ కార్యదర్శిగా చార్జి తీసుకుని సుమారు 18 నెలలైందన్నారు. ప్రస్తుతం ముత్యాలమ్మ చెరువుకు వేలం నిర్వహించేందుకు గ్రామసభకు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని, ప్రజల అభిప్రాయం, పాలకమండలి నిర్ణయం మేరకు పాట పెడతామని అన్నారు. అసలు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు ప్రస్తుతం 10 ఎకరాలు మాత్రమే ఉందని, దాంట్లో నీరు లేదని, అందువల్ల వేలం సొమ్ములు పెద్దగా రావని అన్నారు.

ఇంటింటికీ వెళ్లి రోగులను నిర్ధారించండి



కోరుకొండలో వైద్యులకు సూచనలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

- అన్ని సీజనల్ వ్యాధులకు చికిత్స అందించాలి
- వైద్యసిబ్బందితో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- కోరుకొండ సహా పలు చోట్ల వైద్యశిబిరాల పరిశీలన

కోరుకొండ, సెప్టెంబరు 1: వైద్య శిబిరానికి ముందుక గ్రామంలో పారా మెడికల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రోగులను నిర్ధారించాలని, అన్ని సీజనల్ వ్యాధులకు చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన కోరుకొండ అంకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అన్ని సీజనల్ వ్యాధులకు సంబంధించి ఆరోగ్య విద్యను అందించాలన్నారు. సురక్షితమైన నీటిని తాగడం, వేడి ఆహారం తీసుకోవడం వంటి చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. వ్యాధి సోకడానికి ముందుగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టాలన్నారు. అనంతరం ఆయన దోసకాయలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని నరేంద్రపురం, పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు వద్ద ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరాలను సందర్శించినట్టు పేర్కొన్నారు. ఈ శిబిరంలో కోరుకొండ వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాజానగరం, సెప్టెంబరు 1: ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ టి.ఉదయ ఏంజెల్ పేర్కొన్నారు. మండలంలోని కానవరం, నరేంద్రపురం గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరపీడిత లక్షణాలున్న అనుమానితులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే ఫీవర్, డయేరియా సర్వే జరిపి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌వీవీ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, హెల్త్‌అసిస్టెంట్ రవికుమార్, ఏఎన్‌ఎం సంధ్య, ఆశాలు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో ఫీవర్, సీజనల్ వ్యాధులపై సర్వే చేపట్టి మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

- బొమ్మూరు కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ ఆధ్వర్యంలో ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న ఎస్టీయూ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు1: ఓపీఎస్ అమలు చేయాలంటూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) పిలుపుమేరకు బొమ్మూరు కలెక్టరేట్ వద్ద ధర్నాచేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సీపీఎస్ అమలు చేసిన రోజు సెప్టెంబరు 1న వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశామని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఓపీఎస్ మాత్రమే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఆమోదమని, దాని అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డేనియల్‌బాబు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, రాష్ట్ర నాయకుడు సూరిబాబు, త్రినాధ్, నాయకులు అయ్యో సుబ్బారావు, భరద్వాజ్, రాజబాబు, లక్ష్మినారాయణ, దాసరి శివ, సత్యమూర్తి పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి: త్రినాథ్‌బాబు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 1: పాత పింఛను విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు కోరారు. సెప్టెంబరు 1వ తేదీ సీపీఎస్ అమల్లోకి వచ్చిన రోజు కావడంతో ఆ రోజును సీపీఎస్ వ్యతిరేక దినం పాటిస్తున్నామని ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు 20ఏళ్లుగా ఎన్నో ప్రాతినిధ్యాలు ఆందోళనలు చేస్తున్నా ఇంతవరకూ సీపీఎస్ రద్దు కాకపోవడం విచారకరమన్నారు. విశ్రాంత ఉద్యోగులు గౌరవప్రదంగా జీవించడం ఓపీఎస్ వల్లే వీలవుతుందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఓపీఎస్‌ను తిరిగి అమలులోకి తీసుకువచ్చి ఉద్యోగులకు మేలు చేయాలని త్రినాథబాబు కోరారు.

పాలమూరులో మెగా దంత వైద్య శిబిరం

మూడు రోజుల పాటు వైద్య సేవలు



శిబిరాన్ని ప్రారంభించి వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 1: మండలంలోని పొలమూరులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా దంత వైద్య శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. డబ్ల్యూహెచ్‌వో సూచనలతో జీఎస్ఎల్ మెడికల్, దంత వైద్య కళాశాలల ఆధ్వర్యంలో నెల రోజుల క్రితం అనపర్తి మండలంలో 11, బిక్కవోలు మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇంటింటా దంత పరీక్షల కార్యక్రమాన్ని చేపట్టి 13 వేల మందికి వైద్య సేవలు అవసరమని గుర్తించారు. వారందరికీ వైద్య సేవలు అందించేందుకు మూడు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దంతాల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని చెప్పారు. కాగా శిబిరంలో వైద్యులు రూపొందించిన రూ.30వేల విలువైన పళ్ల సెట్టును ఓ మహిళకు ఎమ్మెల్యే నల్లమిల్లి వైద్యుడి అవతారంలో అమర్చి తగు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల వైద్యులు, వైద్య విద్యార్థులు 150 మంది సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి చిన్నారెడ్డి, తేనెల శ్రీనివాస్, గొలుగూరి భాస్కరరెడ్డి, జుత్తుగ కృష్ణ, శివరామారెడ్డి పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బిక్కవోలు, సెప్టెంబరు 1: ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరి ఆరోగ్యంగా వుంటారని ద్రాక్షారామంకు చెందిన పిరమిడ్ మాస్టర్ మణికంఠ అన్నారు. కొంకుదురు శ్రీశివరామకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం జరిగిన ధ్యాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉపన్యాసం చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన గొలుగూరి భాస్కరరెడ్డి, గంగావతి దంపతులు అన్నదానం నిర్వహించారు.

ముంపు సమస్యను పరిష్కరిస్తాం



డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 1: పట్టణంలో ముంపు సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 36,37,39 డివిజన్ల పరిధి లలితానగర్, ఆదెమ్మదిబ్బ, కృష్ణానగర్, లింగంపేట ప్రాంతాల్లో డ్రైనేజీ లు, సీసీ రోడ్ల నిర్మాణాలు ఆదివారం పరిశీంచారు. నాణ్యతతో సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డివిజన్ ఇన్‌చార్జిలు ఉర్లంకల లోకేశ్, టి.బాబి, వై.ప్రదీప్ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తదితరులు ఉన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

రంగంపేట, సెప్టెంబరు 1: రంగంపేటలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి ఆదివారం తెలిపారు. రంగంపేట శివారులోని ఖాళీ స్థలంలో కొందరు పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడిచేశామన్నారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి మూడు మోటార్‌సైకిళ్లు, రూ.3,900 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

చవితికి నేటి నుంచి దరఖాస్తులు స్వీకరణ

మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 31 : రాజమహేంద్రవరం పరిధిలోని గణపతి ఉత్సవాలకు సంబంధించిన అనుమతుల సింగిల్ విండో విధానంలో జారీ చేస్తున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్పొరేషన్‌కార్యాలయం రెండో అంతస్తులోని టౌన్ ప్లానింగ్ విభాగంలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పందిళ్ళు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పవన్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అభిమానులను అభినందిస్తున్న అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 1: డిప్యూటీ సియం పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం ధన్వంతరి బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబి రం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ప్రారంభించారు. పవన్ అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి పాల్గొన్నారు.

పంటలు నీట మునగవు: తహశీల్దార్

సీతానగరం, సెప్టెంబరు 1: ప్రస్తుతం తుఫాన్ కారణంగా కురుస్తున్న అధిక వర్షాల వల్ల సూరంపాలెం ప్రాజెక్ట్ మిగులు జలాలు విడుదలతో మండలంలోని పంట భూములకు ఏవిధమైన నష్టం వాటిల్లదని, పంటభూములు ముంపుకు గురయ్యే అవకాశం లేదని తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గోదావరి వరద లేనందున మురుగు కాలువ ద్వారా బొబ్బిల్లంక తొర్రిగడ్డ కాలువకు చేరుకుని స్లూయిజ్ ద్వారా వరద నీరు గోదావరిలో కలిసిపోతుందని, అందుచేత పంటభూములు ముంపుకు గురయ్యే అవకాశం లేదన్నారు. మండలంలోని వర్షాల వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. గ్రామాల్లో ఏవిధమైన ఇబ్బందులు కలిగినా తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని చెప్పారు.

హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలి

బీసీ హాస్టళ్లను తనిఖీ చేసిన జిల్లా అధికారి శశాంక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1: హాస్టళ్లలో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి బి.శశాంక అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం రాజమహేంద్రవరంలోని అర్బన్, రూరల్ బీసీ కళాశాల బాలికల హాస్టళ్లు, బీసీ బాలుర వసతి గృహాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో హాస్టల్ వార్డెన్లకు పలు సూచనలు చేశారు. హాస్టల్ పిల్లలకు వేడివేడిగా ఆహారపదార్థాలు వడ్డించాలని ఆదేశించారు.

కోరుకొండలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు

కోరుకొండ, సెప్టెంబరు 1: టీడీపీ అధినేత చంద్రబాబు మొదటిసారిగా సీఎంగా పదవీ ప్రమాణ స్వీకారం చేసి 29 ఏళ్ల పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఆదివారం కోరుకొండలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మాతా సీతారాముడు, మాతా ప్రభు, సర్పంచ్‌లు రొంగల శ్రీనివాసు, కుచ్చు చల్లారావు, తెలగంశెట్టి శ్రీనివాసు, కామిశెట్టి దొరబాబు, బొడ్డేటి ధర్మరాజు, పీతా సుబ్రహ్మణ్యం, రమేష్, శ్రీరాములు, చంటిబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆలయ నృత్యప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న దుర్గాప్రసాద్ శిష్య బృందం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 1: శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో సప్పా దుర్గాప్రసాద్ శిష్యులు 12 మంది ప్రదర్శించిన ఆలయ నృత్యం ఆకట్టుకుంది. సద్గురు సన్నిధి నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం తొలుత కుంభహారతితో ఆరుషి ప్రవేశించగా భువన, రిషి, హాసిని, అరుషి, శరణ్య, నయనిక, నవ్యశ్రీ, ఆశ్రిత పుష్పాంజలి సమర్పించారు. సద్గురు సన్నిధి స్థాపకులు మధుసూదనరావు తదితర ప్రముఖులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించి, 12 మంది నర్తకీమణులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు.

లక్ష్మీనరసాపురంలో విషాదఛాయలు

బైక్‌ను ఢీకొన్న బొలెరో..యువకుడి మృతి, మరొకరికి గాయాలు



మణికంఠ(ఫైల్)


అనపర్తి/జగ్గంపేట, సెప్టెంబరు 1: జగ్గంపేట సమీపంలో రాయవరం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంతో అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన కోనాల సాయి మణికంఠరెడ్డి(25), నల్లమిల్లి శివారెడ్డి బైక్‌పై నర్సీపట్నం బయలుదేరారు. మార్గమధ్యలో రాయవరం గ్రామ శివారున మూత్ర విసర్జనకు రోడ్డు పక్కన ఆగారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠరెడ్డి(25) అక్కడికక్కడే మృతి చెందగా శివారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మణికంఠ జనసేన పార్టీలో తిరుగుతుండేవాడు. తండ్రి గతంలోనే మృతిచెందాడు. దీంతో ఒక్కగానొక్క బిడ్డను తల్లి అన్నీ తానే పెంచింది. రోడ్డు ప్రమాదంలో కుమారుడు మరణించడంతో నాకెవరు దిక్కంటూ ఆమె రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేచింది. పోస్టుమార్టం అనంతరం సాయంత్రం మణికంఠ మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో బంధువులు అంత్యక్రియలు జరిపారు.



40 ఏళ్ల తరువాత కలుసుకున్నారు..

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల కలయిక

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 1: పెద్దలు పిల్లలైపోయారు.. ఏరా.. ఒరేయ్ అంటూ చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు.. రోజంతా ఆనందంగా గడిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 1981-84 బ్యాచ్ బీకాం విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కళాశాల ఆవరణలో సరస్వతి విగ్రహం వద్ద సాయంత్రం వరకూ సందడి చేశారు. ఆనాటి గురువులు సిహెచ్.కామేశ్వరరావు,లక్ష్మణ్‌లను సత్కరించారు.







సీఎస్‌ఆర్.. నిధుల్!

జిల్లాలో చిన్నా పెద్దా కలిసి సుమారు 400 వరకూ పరిశ్రమలు ఉన్నట్టు సమాచారం. ఆయా పరిశ్రమలు సామాజిక బాధ్యతగా తమ ఆదాయం నుంచి 2శాతం సీఎస్‌ఆర్ నిధులకు కేటాయించాలి.. ఆ కంపెనీ ఉన్న ప్రాంతంలో అభివృద్ధి చేయాలి.. గతంలో అలాగే చేసేవారు. కాలం మారింది.. ఆయా పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతను బరువుగా ఫీలవుతున్నా యి.. జిల్లా యంత్రాంగం గత మూడేళ్ల నుంచీ సీఎస్‌ఆర్ నిధుల లెక్కలు ఇవ్వాలని 15 కంపెనీలకు లేఖలు రాస్తే కేవలం 4 కంపెనీలే స్పందించాయి. ఉన్నతాధికారులు సేవ చేయడానికి ముందుకు రావాలని కోరినా పట్టించుకోకపోవడం గమనార్హం. చట్టాల ముసుగులో సేవకు స్వస్తి చెబుతున్నారనేది వాస్తవం.

పరిశ్రమలకు..భారమా!?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సీఎస్‌ఆర్ నిధుల్లో అయోమయం నెలకొంది. పరిశ్రమల యాజమాన్యాల ఆలోచన పక్కదారి పట్టడంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) నిధులను ఏదో విధంగా దారి మళ్లించేస్తున్నారు. చట్టంలోని అంశాలను పరిశ్రమలు తమకు అనుకూలంగా అన్వయించుకోవడంతో అధికారులు సైతం వెనుకడుగు వేసే పరిస్థితి ఉంది. జిల్లా నుంచి లబ్ధి పొందుతూ ఎక్కడో ఏదో చేస్తున్నామంటూ కాగితాలపై లెక్కల గారడీ తప్ప వాస్తవంలో మాత్రం చేసిందేం కనిపించడంలేదు. సమాజానికి ప్రయోజనకరంగా ఆదర్శంగా నిలవాల్సిన పరిశ్రమలకు సామాజిక బాధ్యత బరువుగా మారడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ప్రహసనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సోషల్ రెస్పాన్సిబిలిటీ ఏమైంది?

పరిశ్రమలు సమాజానికి మేలు చేయాలనే ఉద్దేశంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్)ని చట్ట సవరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. పర్యావరణ హితం, నైతిక బాధ్యత, దాతృత్వం, ఆర్థిక చేయూత వంటివి దీనిలో ఇమిడి ఉన్నాయి. సీఎస్‌ఆర్ నిధులను కొన్ని జిల్లాల్లో స్వచ్ఛందంగా కలెక్టరు ఖాతాకు జమచేయడం ద్వారా ఆయా గ్రామాలు/ పట్టణాల్లో మౌలిక వసతులు కల్పిస్తారు. కానీ కొన్ని జిల్లాల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. సీఎస్‌ఆర్ నిధులను కంపెనీలు సొంతంగా సామాజిక అవసరాలకు ఖర్చు చేయొచ్చని చట్టం చెబుతుండడంతో తాము ఫలానా పనులు చేశామంటూ లెక్కల్లో చూపెడుతున్నారు. వాస్తవంలో వీటిని తనిఖీ చేసే యంత్రాంగం లేకపోవడంతో కాగితాలపై ఉన్న లెక్కలనే నమ్మాల్సి వస్తోంది. భారీ కంపెనీలు సైతం ఇదే పంథాలను అనుసరిస్తుండడం సమాజాభివృద్ధికి అవరోధంగా పరిణమించింది. సీఎస్‌ఆర్‌లో ప్రభుత్వానికి ఎలాంటి ప్రమేయం లేకపోవ డంతో అధికారులు గట్టిగా అడగలేని పరిస్థితి ఉంది. సీఎస్‌ఆర్ నిధులు సవ్యంగా ఖర్చు చేశారా లేదా? అనే విషయాలను కలెక్టర్ పరిశీలించవచ్చు. ఒక వేళ కంపెనీ అబద్ధాలు చెబుతోందని నిర్ధారణ అయితే బాధ్యులకు ఒక నెల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. తనిఖీలు మొదలుపెడితే తమ కార్యకలాపాలకు సదరు అధికారులు అడ్డు వస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళుతున్నాయి. ఈ క్రమంలో సీఎస్‌ఆర్ నిధుల వ్యవహారం సున్నిత అంశంగా మారిపోయింది. ఇప్పుడు పలు పనులకు సీఎస్‌ఆర్ నిధులను అడిగినా ఏదోక సాకుతో కాలం గడిపేస్తున్నారు.

నిధులు ఏమవుతున్నాయ్?

ఒక కంపెనీకి సంబంధించి ఎక్కడో ప్రధాన కార్యాలయం ఉంటుంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో ఉన్న కంపెనీకి ప్రధాన కార్యాలయం విదేశాల్లో లేదా వేరే రాష్ట్రంలో ఉంటుంది. ఇక్కడ పరిశ్రమలో ఉత్పత్తి జరగడం లాభాలు ఆర్జించడం జరుగుతోంది. కానీ తమ ప్రధాన కార్యాలయం రూపొందించిన ఏడాది ప్రణాళిక ప్రకారం సీఎస్‌ఆర్ ఖర్చు చేస్తున్నామని చెబుతారు. కంపెనీ వేరే పేర్లతో ఒక ట్రస్టు, స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా చాలా పనులు చేస్తున్నామంటూ లెక్కలు చూపెడుతున్నారు. పరిశ్రమ ఉన్న చుట్టు పక్కల గ్రామాల్లో ఆ ఏడాదిలో తమకు వచ్చిన లాభాల్లో 2% చట్ట ప్రకారం సమాజానికి ఇచ్చేశామంటూ కాగితాల్లో చూపెడుతున్నారనే అపవాదు ఉంది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో లేదా పట్టణాల్లో ప్రభుత్వం గుర్తించిన, ప్రజాప్రతినిధులు కోరిన పనులకు సీఎస్‌ఆర్ నిధులు రావడం లేదు. సీఎస్‌ఆర్ నిధులను కలెక్టరు ఖాతాకు జమ చేస్తే ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు,ఎంపీలు తదితర ప్రజా ప్రతినిధుల సిఫారసులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఇంజనీరింగ్ యంత్రాంగంతో పనులు చేయించి తగు తనిఖీల తర్వాత బిల్లులు చెల్లిస్తారు. గతంలో ఇలా పనులు జరిగిన వాటికి

- కానరాని సామాజిక సేవ
- పక్కదారి పడుతున్న నిధులు
- చట్టాలను అడ్డుపెట్టుకుని మళ్లింపు
- సామాజిక సేవకు దూరం
- అధికారులు అడిగితే బెదిరింపులే
- ఎక్కడో ఏదో చేశామని లెక్కలు
- సున్నితంగా మారిన సీఎస్‌ఆర్
- పథకం ఉద్దేశం అపహాస్యం

ఆయా కంపెనీలు నిధులివ్వకపోవడంతో సదరు కాంట్రాక్టరు కోర్టును ఆశ్రయించాల్సి వస్తోంది. అప్పుడు గానీ సంబంధిత కంపెనీ బిల్లు చెల్లించని సందర్భాలు ఉన్నాయంటే ఆ కంపెనీకి సీఎస్‌ఆర్ నిధులపై ఎంత బాధ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో పరిస్థితి దారుణం

సీఎస్‌ఆర్ నిధుల విషయంలో జిల్లాలో దారుణమైన పరిస్థితి కనిపిస్తోంది. పరిశ్రమలు ఉన్నా నిధుల అంశం పితలాటకంగా మారింది. కంపెనీ ఏడాది ఆదాయం రూ.5 కోట్లు ఉన్నా, కంపెనీ నికర విలువ రూ.500కోట్లు ఉన్నా, ఏడాది టర్నోవరు రూ.వెయ్యి కోట్లు ఉన్నా సీఎస్‌ఆర్ పరిధిలోకి రావాల్సిందే. ఇప్పటి వరకూ జిల్లాలో ఎన్ని కంపెనీలు సీఎస్‌ఆర్ పరిధిలోకి వస్తాయి? ఎంత సీఎస్‌ఆర్ ఖర్చు చేయాల్సి ఉంది? ప్రతి ఏడాదీ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారా? అనే తదితర అంశాలపై ఇప్పటి వరకూ ఒక నిర్దిష్టమైన సమాచారం లేదు. కలెక్టర్‌గా పి.ప్రశాంతి బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీఎస్‌ఆర్ నిధులతో కొంత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ మార్గనిర్దేశాలకు అనుగుణంగా సీఎస్‌ఆర్ నడుస్తోందా లేదా అనేది పరిశీలనకు ఉపక్రమించారు. గత మూడేళ్ల నుంచీ బ్యాలెన్స్ షీట్లు తదితర సమాచారం ఇవ్వాలని 15 కంపెనీలకు లేఖలు రాయగా ఇప్పటి వరకూ కేవలం 4 కంపెనీలే స్పందించడం గమనార్హం. జిల్లాలో వివిధ పనుల నిమిత్తం కేవలం రూ.30కోట్లు సీఎస్‌ఆర్ నిధులివ్వాలంటూ అంచనాలు జత చేసి లేఖలు రాసినా పరిశ్రమలు పెద్దగా పట్టించుకోవడం లేదు.రూ.5లక్షలు ఇవ్వడానికి పెద్ద పరిశ్రమలు వెనుకాడుతుండడం సీఎస్‌ఆర్ ఉద్దేశాన్ని అపహాస్యం చేస్తోంది.

ఫ్యాక్టరీలకు సేవాప్రతిపాదనలు ఇలా..

పరిశ్రమ పేరు	ప్రతిపాదిత పనులు	నిధులు(లక్షల్లో)
హెచ్‌పీసీఎల్	1	500
ఏపీ పేపర్ మిల్స్	5	303
ఐసీఐసీఐ ఫౌండేషన్	1	45
ఆంధ్రా షుగర్స్	3	15
అవంతి ఫీడ్స్	20	216
కార్గిల్ ఇండియా	1	5
గెయిల్ ఇండియా	6	388
గ్రాసిమ్ ఇండస్ట్రీస్	8	40
ఐఓసీఎల్	3	35
ఆయిల్ ఇండియా కార్పొరేషన్	2	50
ఓఎన్‌జీసీ	33	958
పవర్ గ్రిడ్	5	152
సర్వారాయ సుగర్స్	5	133
మొత్తం		2840

కలెక్టరేట్‌కు అతి దగ్గరలో ఉన్న హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఐఎల్‌టీడీలు సీఎస్‌ఆర్‌పై అసలు స్పందించకపోవడం గమనార్హం.

డ్రగ్స్ యూనిట్‌లో ఉన్న సామగ్రి

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

ఘంటావారిగూడెంలో డ్రగ్స్ యూనిట్ సీజ్

- ఇద్దరి అరెస్టు.. చిక్కని ప్రధాన నిందితుడు
- విస్తృతంగా పోలీసుల గాలింపు
- ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు

నల్లజర్ల,సెప్టెంబరు 1 : నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) తయారీ యూనిట్‌ను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. ఘంటావారిగూడెం చక్రధారి దాల్‌అండ్ ఫ్లోర్ మిల్‌ను ఆదివారం ఉదయం పరిశీలించి మాట్లాడారు. గ్రామానికి చెందిన రైతు తాతిన బాలుకు చెందిన చక్రధారి దాల్ అండ్ ఫ్లోర్ మిల్‌ను ఏలూరు జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి లీజుకు తీసుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ మాకం వెంకటేష్,జగదీష్‌లతో కలిసి డ్రగ్స్ యూనిట్ నిర్వహిస్తున్నాడు.ఈ యూనిట్ ద్వారా ఆల్ప్రజోలం తయారు చేసి హైదరాబాద్‌లో కల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు.600 లీటర్ల కల్లులో ఒక గ్రాము ఆల్ప్రజోలం కలిపితే కిక్కు బాగుంటుందని సమాచారం. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన కల్లు వ్యాపారులు ఆల్ప్రజోలం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)కు సమాచారం అందడంతో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు మాదక ద్రవ్యాల తయారీ కేంద్రంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో డ్రగ్ తయారీకి ఉపయోగపడే రా మెటీరియల్, ఆయిల్ బాత్ మిషన్, ఓవెన్, ఇతర యంత్ర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు.నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.ప్రధాన నిందితుడు పోలీసులకు చిక్కకపోవడంతో గాలింపుచర్యలు వేగవంతం చేశారు. ఈ కేసుకు సంబంధించి మరి కొందరిని అదుపులోకి తీసుకోవాలన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.జిల్లాలో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు,కుటీర పరిశ్రమలు నెలకొల్పకుండా ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు యథాతథంగా పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్ ,సెప్టెంబరు 1: జిల్లా వ్యాప్తంగా జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ ఎస్.చిన్నరాముడు ఇతర జిల్లాల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అన్ని కార్యాలయాల్లో సంబంధిత శాఖల అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు.



కదలరు..వదలరు

- రాజానగరంలో పాతుకుపోయిన కానిస్టేబుళ్లు
- మామూళ్ల మత్తు.. సారాబట్టీలకు దాష్టీకం
- స్థానిక బంధుత్వాలతో గుట్టుగా దందా
- ఐదేళ్లు దాటినా పైరవీలకు ప్రయత్నాలు

రాజానగరం, సెప్టెంబరు 1 : పోలీస్ శాఖలో ఉన్నతస్థాయి అధికారుల బదిలీలు అలవోకగా సాగిపోతున్నాయి. ఏడాదికి ఒకరిద్దరు ఎస్‌ఐలు మారుతున్నారు. అయితే కానిస్టేబుళ్ల మాత్రం అక్కడే పాతుకుపోతున్నారు. ఏళ్ల తరబడి ఒకటే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ వదిలి వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. నెల వారీ మామూళ్లకు అలవాటు పడిన సిబ్బందిలో కొంత మంది తమ బదిలీల సమయం పూర్తయినప్పటికీ ఇతర స్టేషన్‌లకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో అవినీతి అరాచకాలకు అలవాటు పడిన సిబ్బంది ఇప్పుడు కూడా అదే దందాలను కొనసాగించే పనిలో పడ్డారు. రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పైబడిన కానిస్టేబుళ్ల అనేక మంది ఉన్నారు. వీరు మామూళ్లకు అలవాటు పడి మళ్లీ మామూలుగానే కొనసాగేందుకు పైరవీలు కొనసాగిస్తున్నారు. గతంలో వైసీపీ నాయకులకు తప్ప ఇతర పార్టీల నాయకులకు కనీస గౌరవం ఇవ్వని సిబ్బంది ఇప్పుడు కూటమి నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఎలాగైనా సరే ఇక్కడి నుంచి కదలకుండా ఉండేలా సిఫార్సుల కోసం భారీ మొత్తంలో చేతులు తడిపేందుకు ఎవరి ప్రయత్నాలు వారు సాగిస్తున్నారు. వీరిలో కొంత మంది ఉన్నతాధికారులను సైతం తప్పుదారి పట్టిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి. నాటు సారా బట్టీలు, పేకాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలను నిరోధించే క్రమంలో భాగంగా అధికారులు చేపట్టే చర్యలను ముందుగానే అక్రమ వ్యాపారులకు సమాచారం చేరవేస్తున్నారనే అపవాదు లేకపోలేదు. చాలా గ్రామాల్లో నాటు సారా తయారీ కుటీర పరిశ్రమగా మారడం వెనుక స్టేషన్‌లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది అందిస్తున్న సహాయ సహకారాలేనని పలువురు చెప్పుకొస్తున్నారు. అలాగే హైవే వెంబడి కొనసాగుతున్న వ్యభిచార స్థావరాల్లో కూడా పోలీసుల ప్రమేయం ఉన్నట్టు సమాచారం. వేశ్యల వద్దకు వచ్చే విటులను భయభ్రాంతులకు గురిచేసి వారి జేబుల్లో ఉన్న సొమ్మును అందిన కాడికి దోచుకున్న సందర్భాలు అనేకం. ఇటువంటి కార్యకలాపాల్లో స్టేషన్‌లో రికార్డులు నిర్వహించే సిబ్బందిలో ఒకరు కీలకంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ద్వారా తెలిసింది. ఇప్పటికీ సదరు వ్యక్తి స్టేషన్‌లో పెత్తనం చెలాయిస్తూ పోలీసు వ్యవస్థకు మచ్చతెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు.కొంత మంది కానిస్టేబుళ్ల ఇక్కడే బంధుత్వాలు పెంచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.ఇటీవల సీఐగా బాధ్యతలు చేపట్టిన ప్రసన్న వీరయ్య గౌడ్ స్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై కన్నేసి ఉంచాలని ప్రజలు విన్నవించుకుంటున్నారు. వచ్చే బదిలీల్లో రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లను సాగనంపితేనే ప్రక్షాళన జరుగుతుందని అంటున్నారు.

జ్వరం కేసు వస్తే పరీక్షించండి : డీఎంహెచ్‌వో

దివాన్‌చెరువు, సెప్టెంబరు 1 : ప్రతీ జ్వర కేసుకు పరీక్షలు తప్పక నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. రాజానగరం మండలం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో పాలచర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారామెడికల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి శిబిరానికి రోగులు హాజరయ్యేవిధంగా చూడాలన్నారు. అన్ని సీజనల్ కేసులకు చికిత్స చేయాలని చెప్పారు. రాబోయే 10 రోజులల్లోపు ప్రసవ తేదీలు ఉన్న గర్భిణుల జాబితాలను నిశితంగా పరిశీలించాలని చెప్పారు. వారికి సురక్షితమైన ప్రసవాలు జరిగేలా నిర్దేశించిన ప్రభుత్వ ఆసుపత్రులకు మార్చడానికి ఏర్పాట్లు చేయడంతో సహా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి ఆరోగ్యవిద్యను అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బెనడిక్ట్ తదితరులు పాల్గొన్నారు.

వదలని..వరుణుడు

- జిల్లాలో మోస్తరు వాన
- సరాసరి 446.0 మి.మీ వర్షం
- గట్లను పరిశీలించిన కలెక్టర్
- అధికారులకు ఆదేశాలు
- 15 కమాండ్ కంట్రోల్ టీమ్‌లు
- శిథిలావస్థకు చేరిన హాస్టళ్లు
- సురక్షిత భవనంలోకి విద్యార్థులు
- పలు ప్రాంతాలకు బస్‌లు రద్దు
- నేడు బడులకు సెలవు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 1 : వరుణుడు వదల్లేదు.. చెదురుమదురుగా వస్తూనే ఉన్నాడు..అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.ఆదివారం గడచిన 24 గంటల్లో సరాసరి 446.0 మి.మీల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. జిల్లాలో పెరవలి మండలంలో అత్యధికంగా 46.6 మి.మీ.. అత్యల్పంగా కోరుకొండలో 5.8 మి.మీ వర్షం పడింది. గోకవరంలో 46.2 మి.మీ, నల్లజర్లలో 33.6, దేవరపల్లి 33.2, తాళ్ళపూడి 27.0, గోపాలపురం 26.0, చాగల్లు 23.4, అనపర్తి 22.8, బిక్కవోలు 21.8, సీతానగరం 22.8, నిడదవోలులో 21.2, రాజానగరం 19.8, రాజమహేంద్రవరం 18.6, కడియం 16.2, ఉండ్రాజవరం 16.6, రంగంపేటలో 15.0, కొవ్వూరులో 15.2, రాజమహేంద్రవరం రూరల్‌లో 14.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



22 కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో భారి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలను కలెక్టర్ పి.ప్రశాంతి అప్రమత్తం చేశారు. ఇప్పటికే 19 మండలాల పరిధిలో 22 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. తాజాగా ఆదివారం కలెక్టరేట్‌లో 15 శాఖలతో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం నిఘాపెట్టించారు. కలెక్టర్ ఆదివారం జిల్లాలో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.భారీ వర్షాలు పడితే జరిగే పరిణామాల నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన పనులకు విద్యుత్,వైద్యఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.చెరువు, కాలువ గట్లు పటిష్టతకు ఇరిగేషన్ అధికారులను సన్నద్ధం చేశారు.

హాస్టల్ విద్యార్థుల తరలింపు..

కోరుకొండ, సెప్టెంబరు1 : శిథిలావస్థకు చేరి న హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనాల్లోకి తరలించాలని జేసీ చినరాముడు అధికారులను ఆదేశించారు.కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం అధికారులతో సమీక్షించారు. కాపవరం గ్రామంలో పర్యటించి శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం స్లాబును పరిశీలించారు.క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు వసతి గృహలను తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 26 మంది బాలికలను సురక్షిత భవనంలోకి తరలించినట్టు అధికారులకు తెలిపారు. ఈ పంటన వెహాదంకు సెప్టెంబరు 15వ తేదీ వరకు మాత్రమే సమయం ఉందని జేసీ తెలిపారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, తహశీల్దార్ వి.సుస్వాగతం, వ్యవసాయ శాఖ ఏడీ మల్లికార్జునరావు, ఎంపీడీవో నరేష్‌కుమార్, ఏవో గౌరీదేవి తదితరులు ఉన్నారు.



హాస్టల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ చిన్నరాముడు

నేడు విద్యాసంస్థలకు సెలవు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)/కోరుకొండ: వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థలకు సోమవారం(నేడు) సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అధిక వర్షపాతం ఉం టుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, అగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈవో వాసుదేవరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ పాఠశాలలు తెరిస్తే గుర్తింపు రద్దుకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. వర్షం వల్ల శనివారం సెలవు ప్రకటించినప్పటికీ అక్కడక్కడా ప్రైవేట్ పాఠశాలలు పనిచేసినట్టు కలెక్టర్ దృష్టికి ఫిర్యాదులువచ్చాయన్నారు. సోమవారం ఇటువంటి ఫిర్యాదు వస్తే సంబంధి త యాజమాన్యాలపై చర్యలు తప్పవన్నారు. సోమవారం జరగాల్సిన సెల్ ఎసెస్‌మెంట్ పరీక్షలను ఈ నెల 9న వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

ఒక్క ఎకరా ముంపునకు గురికాకూడదు : కలెక్టర్

దేవరపలి, సెప్టెంబరు 1 : అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. దేవరపల్లి మండల కురుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్న బర్లవాగును ఆదివారం పరిశీలించారు.ప్రతి ఏటా బర్లవాగు వల్ల వేలాది ఎకరాల్లో పంట ముంపున కు గురవుతుందని రైతులు, గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. బర్లవాగుపై ఐదు చోట్ల గతంలో భారీ వర్షాల వల్ల గండ్లుపడ్డాయని ఇరిగేషన్ ఏఈఈ రాహుల్ భాస్కర్ తెలిపారు. యుద్ధప్రతిపాదికన గండ్లు పూడ్చాలని ఒక్క ఎకరా కూడా ముంపునకు గురికాకూడదని కలెక్టర్ ఆదేశించారు.

ఏటిగట్లు పటిష్టం చేయండి



దేవరపల్లి మండలం కురుకూరులో బర్లవాగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు, సెప్టెంబరు 1 : బలహీనంగా ఉన్న ఏటిగట్లను పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి నిడదవోలు మండలం కంసాలిపాలెంలో ఏటిగట్లను ఆదివారం పరిశీలిం చారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న రెండు మూడు రోజుల్లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువలలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని బలహీనంగా ఉన్న గట్లు వద్ద తగిన రక్షణ చర్యలు చేపట్టాల న్నారు. ఇసుకబస్తాలు వేయాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పునరావాసకేంద్రాలకు తరలించేం దుకు తగిన కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. కంసాలిపాలెంలో బలహీనంగా ఉన్న గట్ల వద్ద రక్షణగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించి తగిన సూచనలు చేశారు.

విజయవాడకు ఐదు ఆర్టీసీ సర్వీసులు రద్దు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 : ఎడతెరిపిలేని వర్షాల నేపథ్యంలో ఆదివారం ఆర్టీసీ జిల్లా అధికారులు పలు సర్వీసులను రద్దు చేశారు. ప్రధానమైన విజయవాడ రూటులో ఐదు బస్సు సర్వీసులను రద్దు చేశారు. భద్రాచలం రూటులోనూ బస్సులను నిలిపివేశారు. రాజమహేంద్రవరం-విజయవాడ రూటులో షెడ్యూలు మేరకు ప్రతిరోజూ అప్ అండ్ డౌన్‌లో ఏడు సర్వీసులు నడుస్తుంటాయి. వీటిలో ఐదు సర్వీసులు నిలిపివేశారు. రాజమహేంద్రవరం డిపో అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఐదు సర్వీసులను ఒక్కసారిగా రద్దు చేయడంతో విజయవాడ రూటులో రాకపోకలు సాగించే ప్రయాణీకులు నానా ఇబ్బందులు పడ్డారు. విజయవాడ సమీపంలోని హనుమాన్ జంక్షన్‌లో రోడ్లపైకి భారీ ఎత్తున నీరు చేరిందనే సమాచారంతో సర్వీసులను అప్పటికప్పుడు రద్దు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం, గోకవరం డిపోల నుంచి మారేడుమిల్లి, చింతూరు మీదుగా వెళ్లే ఆర్టీసీ సర్వీసులను సైతం నిలివేశారు. ఈ రూటులో రాజమహేంద్రవరం డిపో నుంచి తెల్లవారుజామున ఒక బస్సు నడుపుతున్నారు. గోకవరం డిపో నుంచి మూడు సర్వీసులు నడుస్తున్నాయి. వర్షాల కారణంగా వీటిని నిలివేశారు.

తిరుమల ప్రయాణం వర్షార్పణం



తిరుమల ప్రయాణం వర్షార్పణమైంది. గన్నవరం వద్ద రైల్వే ట్రాక్‌పై వరద నీటి ప్రవాహం కారణంగా రైలు రాజమహేంద్రవరం వచ్చేసరికి కాకినాడ- రేణిగుంట ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు చేశారు. - 7లో

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సీపీఎస్‌ను రద్దు చేయాలి


ఎమ్మెల్యే ముప్పిడికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, సెప్టెంబరు 1: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని జిల్లా సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జోడాల వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం పిలుపుతో ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ పాత పింఛను అమలుకు రూట్ మ్యాప్ రూపొందించాలని, జరగపోయే శాసన సభా సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులపై బనాయించిన అక్రమ కేసులు రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎస్.విశ్వేశ్వరరావు, ప్రసన్నకుమార్, ప్రకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి మృతి ఆత్మహత్య
నడుంనొప్పి, కుటుంబ సమస్యలే కారణం


మృతుడు ఉండవల్లి సత్యనారాయణ

కొవ్వూరు, సెప్టెంబరు 1: మనస్తాపం చెంది వ్యక్తి ఇంట్లో చీరతో ఉరి పోసుకుని మృతి చెందినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరులోని ఇస్లాంపేటలో నివాసం ఉంటున్న జట్టుకూలి ఉడతల సత్యనారాయణ (47) కొంతకాలంగా నడుంనొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స పొందుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. తన ఇద్దరు కుమారులు చదువుకుని ఇంకా సెటిల్ కాలేదని, సొంతిల్లు కూడా లేదని తరచూ మానసిక వేదన చెందుతున్నాడు. ఆగస్టు 31వ తేదీ రాత్రి భార్య, చిన్నకుమారుడుతో కలిసి ఇంట్లో నిద్రించాడు. ఉదయం లేచి వంట గదిలోకి వెళ్లేసరికి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఉండడంతో భార్య వెంటనే చిన్నకుమారుడు, మరిదిని పిలిచింది. చీరను కత్తిరించి సత్యనారాయణను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య కోట సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కోట సత్తెమ్మకు పూజలు



నిడదవోలు, సెప్టెంబరు 1: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.1,15,382 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు

కొవ్వూరు. సెప్టెంబరు 1: కొవ్వూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు ఎవరైనా సెలవు రోజుల్లో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో జె.కెంపురత్నం హెచ్చరించారు. వర్షాల కారణంగా జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించామని, శనివారం సెలవు ప్రకటించినప్పటికీ అక్కడక్కడ కొన్ని ప్రైవేటు పాఠశాలలు పనిచేసినట్టు పత్రికల్లో రాగా సోమవారం ఏ పాఠశాలైనా పనిచేసినట్టు తెలిసినా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఆయా పాఠశాలల యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం జరగవలసిన పరీక్షను ఈ నెల 9న నిర్వహించాలని ఎంఈవో చెప్పారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి


దేవరపల్లిలో అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవర పల్లి, ఆగస్టు 1: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. ఆదివారం దేవరపల్లిలో అన్ని శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. భారీ వర్షాలతో కలిగే అపారిశుధ్యంతో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు కాచిచల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు ప్రతి వాటర్‌ట్యాంక్ వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ.ప్రభాకరరావు, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, వైద్యాధికారులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

అభిమానం నిండుగా.. అభివృద్ధికి అండగా..

- పవన్ అభిమానుల వినూత్న ఆలోచన
- రాజానగరం అంగన్‌వాడీ కేంద్రంలో డిజిటల్ మెరుగులు
- 'క్లీన్ పిఠాపురం'కు కడియం మొక్కలు


రాజానగరంలో సిద్ధం చేస్తున్న డిజిటల్ తరగతి గది

రాజానగరం/కడియం, సెప్టెంబరు 1: తమ అభిమాన హీరో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రాజానగరానికి చెందిన యువకులు వినూత్నంగా ఆలోచించారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా నడుచుకుందామనుకున్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నా చిన్నారులు కొందరు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకపోవడాన్ని గుర్తించారు. చిన్నారులను ఆకర్షించే విధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో డిజిటల్ మెరుగులు అద్దాలని సంకల్పించారు. తమలో ఒకరైన ఎన్ఆర్ఐ స్నేహితుడితో ఆ ఆలోచనను పంచుకున్నారు. పుట్టినరోజు వేడుకలకు చేసే ఖర్చుతో డిజిటల్ తరగతి గది రూపకల్పనకు అవసరమైన డిజిటల్ పరికరాలు, ఆట బొమ్మలు సమకూర్చారు. దీనిని నేడు స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా కడియం నుంచి చిరు సేవా సమితి అధ్యక్షుడు జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గెడ్డం శివరత్నగణపతి రూ.4 లక్షలు విలువ చేసే 12 వేల మొక్కలును ఉచితంగా అందజేశారు. రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ తలపెట్టిన వన మహోత్సవంలో భాగంగా 'క్లీన్ పిఠాపురం.. గ్రీన్ పిఠాపురం' కార్యక్రమానికి లారీలో 12 వేల మొక్కలు పంపుతున్నట్టు శివ తెలిపారు. పవన్‌కళ్యాణ్ సూచించిన ఫల, అటవీశాఖ మొక్కలను పంపించినట్టు చెప్పారు.


కడియం నుంచి పంపుతున్న మొక్కల లారీ

చెరువులకు వేలం ఎప్పుడు?

- నిరుపయోగంగా వదిలేసిన ఆర్థిక వనరు
- పంచాయతీ ఆదాయానికి గండి
- నీరు-చెట్టు, 'ఉపాధి హామీ'తో అభివృద్ధి
- ఆక్రమణలకు గురవుతున్న వైనం


చినకొండేపూడిలోని ముత్యాలమ్మ చెరువు

సీతానగరం, సెప్టెంబరు 1: గ్రామాల్లోని పంచాయతీ చెరువులకు కొన్నేళ్లుగా వేలం నిర్వహించపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతోంది. అంతేగాక చెరువులపై పర్యవేక్షణ కొరవడడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. సీతానగరం మండలం చినకొండేపూడి పంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ చెరువు, చింతల చెరువులకు వేలం పాటలు లేకపోవడంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఏటా రూ.3 నుంచి 4 లక్షల వరకు ఆదాయాన్ని పంచాయతీ కోల్పోతోంది. ఇదీగాక 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముత్యాలమ్మ చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. ఈ ముత్యాలమ్మ చెరువుకు నీరు చెట్టు కార్యక్రమంలో భాగంగా పంచాయతీ తీర్మానంతో రూ.3 లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ చెరువుకు ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు చేపడుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.6,52,777, 2023-24లో రూ.8,93,726 వ్యయంతో పనులు నిర్వహించారు. ఇంత ఖర్చుచేసిన చెరువుకు మాత్రం వేలం పాట పెట్టకుండా వదిలేయడంతో ఏడాదికి సుమారు రూ.3 లక్షలు చొప్పున ఆరేళ్లుగా రూ.18 లక్షల ఆదాయాన్ని పంచాయతీ నష్టపోయింది. ఇది కాకుండా పంచాయతీ పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గురవుతోంది. అసలే పంచాయతీలకు ఆదాయం పడిపోయింది. అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలుగుతున్నా కనీసం ఆర్థిక వనరులు అందించే చెరువులను నిర్లక్ష్యంగా వదిలేసి పంచాయతీ ఆదాయానికి గండిపడుతున్నా పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆదాయం మాత్రం సున్నా. అధికారులు స్పందించి చినకొండేపూడిలోని చెరువులకు వేలం నిర్వహించి పంచాయతీ ఆదాయానికి బాటలు వేయాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయమై చినకొండేపూడి పంచాయతీ కార్యదర్శి ముదునూరి సత్యవేణిని వివరణ కోరగా తాను పంచాయతీ కార్యదర్శిగా చార్జి తీసుకుని సుమారు 18 నెలలు అయ్యిందన్నారు. ప్రస్తుతం ముత్యాలమ్మ చెరువుకు వేలం నిర్వహించేందుకు గ్రామసభకు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని, ప్రజల అభిప్రాయం, పాలకమండలి నిర్ణయం మేరకు పాట పెడతామని అన్నారు. అసలు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు ప్రస్తుతం 10 ఎకరాలు మాత్రమే ఉందని, దాంట్లో నీరు లేదని, అందువల్ల వేలం సొమ్ములు పెద్దగా రావని అన్నారు.

ఇంటింటికీ వెళ్లి రోగులను నిర్ధారించండి

- అన్ని సీజనల్ వ్యాధులకు చికిత్స అందించాలి
- వైద్యసిబ్బందితో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- కోరుకొండ సహా పలు చోట్ల వైద్యశిబిరాల పరిశీలన


కోరుకొండలో వైద్యులకు సూచనలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

కోరుకొండ, సెప్టెంబరు 1: వైద్య శిబిరానికి ముందుకు గ్రామంలో పారా మెడికల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రోగులను నిర్ధారించాలని, అన్ని సీజనల్ వ్యాధులకు చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన కోరుకొండ అంకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అన్ని సీజనల్ వ్యాధులకు సంబంధించి ఆరోగ్య విద్యను అందించాలన్నారు. సురక్షితమైన నీటిని తాగడం, వేడి ఆహారం తీసుకోవడం వంటి చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. వ్యాధి సోకడానికి ముందుగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టాలన్నారు. అనంతరం ఆయన దోసకాయలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని నరేంద్రపురం, పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు వద్ద ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరాలను సందర్శించినట్టు పేర్కొన్నారు. ఈ శిబిరంలో కోరుకొండ వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విష జ్వరాలతో..వణుకు

- గ్రామగ్రామాన వందలాదిగా కేసులు
- ఆసుపత్రుల వద్ద క్యూ- భయపడుతున్న ప్రజలు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్

కోరుకొండ, సెప్టెంబరు 1 : గత కొద్ది రోజులుగా వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు కారణంగా కోరుకొండ మండలంలో అనేక గ్రామాల్లో ప్రజానీకం విషజ్వరాలతో వణుకుతున్నారు.ప్రతి గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ,వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యపరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నప్పటికీ జ్వరాలు అదుపులోకి రావడం లేదు. కోరుకొండ, దోసకాయలపల్లి,కోటికేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి రోజు 150 నుంచి 200 వరకు జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరాల్లోనూ వందల సంఖ్యలో ఓపీ కేసులు నమోదవుతున్నాయి.దీంతో జనం భయపడుతున్నారు. గ్రామా ల్లో సురక్షితమైన మంచినీరు,మెరుగైన పారిశుధ్య పరిస్థితులు కల్పిస్తే తప్ప జ్వరాలు అదుపులోకి వచ్చే పరిస్థితి కానరావడం లేదు.మంచినీటి కుళాయిలు,ట్యాంకులు శుభ్రపరిచి ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని డ్రైన్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని మంచినీటి పైపులైన్ లీకేజీలను అరికట్టాలని..దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న రాజానగరం పీహెచ్‌సీ సిబ్బంది

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాజానగరం, సెప్టెంబరు 1: ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ టి.ఉదయ ఏంజెల్ పేర్కొన్నారు. మండలంలోని కానవరం, నరేంద్రపురం గ్రామాల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరపీడిత లక్షణాలున్న అనుమానితులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే ఫీవర్, డయేరియా సర్వే జరిపి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్‌వీవీ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, హెల్త్‌అసిస్టెంట్ రవికుమార్, ఏఎన్ఎం సంధ్య, ఆశాలు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో ఫీవర్, సీజనల్ వ్యాధులపై సర్వే చేపట్టి మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

- బొమ్మూరు కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ ఆధ్వర్యంలో ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నాచేస్తున్న ఎస్టీయూ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు1: ఓపీఎస్ అమలు చేయాలంటూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) పిలుపుమేరకు బొమ్మూరు కలెక్టరేట్ వద్ద ధర్నాచేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సీపీఎస్ అమలు చేసిన రోజు సెప్టెంబరు 1న వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశామని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఓపీఎస్ మాత్రమే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఆమోదమని, దాని అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డేనియల్‌బాబు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, రాష్ట్ర నాయకుడు సూరిబాబు, త్రినాథ్, నాయకులు అయ్యో సుబ్బారావు, భరద్వాజ్, రాజబాబు, లక్ష్మీనారాయణ, దాసరి శివ, సత్యమూర్తి పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి : త్రినాథ్‌బాబు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 1: పాత పింఛను విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు కోరారు. సెప్టెంబరు 1వ తేదీ సీపీఎస్ అమల్లోకి వచ్చిన రోజు కావడంతో ఆ రోజును సీపీఎస్ వ్యతిరేక దినం పాటిస్తున్నామని ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు 20ఏళ్లుగా ఎన్నో ప్రాతినిధ్యాలు ఆందోళనలు చేస్తున్నా ఇంతవరకూ సీపీఎస్ రద్దు కాకపోవడం విచారకరమన్నారు. విశ్రాంత ఉద్యోగులు గౌరవప్రదంగా జీవించడం ఓపీఎస్ వల్లే వీలవుతుందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఓపీఎస్‌ను తిరిగి అమలులోకి తీసుకువచ్చి ఉద్యోగులకు మేలు చేయాలని త్రినాథబాబు కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెరవలి/దేవరపల్లి, సెప్టెంబరు 1: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ అచ్యుతకుమారి చెప్పారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వర్తించారు. వీఆర్వోలందరూ అందుబాటులో ఉండి ఏ గ్రామంలో ఏ ఇబ్బంది తలెత్తినా వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. అలాగే రైతులు, ప్రజానీకం తమకు ఎక్కడ ఇబ్బంది కలిగినా రెవెన్యూ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. కాగా ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉన్నప్పటికీ పెద్దగా వర్షం కురవకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే దేవరపల్లి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, ఇళ్లలో ఎవరూ ఉండొద్దని, ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది అంతా తహశీల్దార్ కార్యాలయంలో ఉంటూ ఎప్పటికప్పుడు వర్షాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

సింహాద్రి రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు



ఉండ్రాజవరం, సెప్టెంబరు 1: టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ జన్మదిన వేడుకలను ఉండ్రాజవరంలోని ఆయన స్వగృహంలో ఆదివారం అభిమానులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అభిమానులు సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. సత్యవాడ తదితర గ్రామాల నుంచి సింహాద్రి అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరేశ్వరస్వామికి లక్షబిళ్వార్చన



కొవ్వూరు, సెప్టెంబరు 1: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీబాలత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో లక్షబిళ్వార్చన నిర్వహించారు. ఆదివారం ఆలయార్చకులు విశేషపూజలు చేశారు. స్వామికి ఏకవార రుద్రాభిషేకం, గణపతిపూజ, అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. పండితులు వేదస్వస్తి చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పాలంగిలో నందమూరి అభిమానుల వేడుకలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 1: ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ సినీరంగ ప్రవేశం చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం రాత్రి మండలంలోని పాలంగి గ్రామంలో నందమూరి అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ కేక్ కట్ చేశారు. సినీరంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈడ్పుగంటి ఉదయకుమార్, బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాలు



ఉండ్రాజవరం, సెప్టెంబరు 1: రాష్ట్రంలో భారీ వర్షాలకు నిరాశ్రయులైన వారికి సహకారం అందిస్తున్నట్టు స్థానిక బౌద్ధ దమ్మ పీఠం అధిపతి అనాలయో ఆదివారం తెలిపారు. విజయవాడ పరిసర వరద ప్రాంతాలైన నందమూరి నగర్, ఆంధ్రప్రభ కాలనీ, సింగునగర్ రాజరాజేశ్వరిపేట, సుందరయ్య నగర్, ఎల్బీఎస్ నగర్, రాజీవ్ నగర్, ప్రకాష్ నగర్, కండ్రిక, శాంతినగర్‌లో సుమారు 2వేల మందికి పులిహోర ప్యాకెట్లు, 2వేలు వాటర్ బాటిల్స్ పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మల్లిన శ్రీనివాసరావు, బూరుగుపల్లి కళారావు, గంటా వెంకట్రావు, నందిన రమేష్, కోటిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో మెగా దంత వైద్య శిబిరం
మూడు రోజుల పాటు వైద్య సేవలు


శిబిరాన్ని ప్రారంభించి వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 1: మండలంలోని పొలమూరులోని శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా దంత వైద్య శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. డబ్ల్యూహెచ్‌వో సూచనలతో జీఎస్ఎల్ మెడికల్, దంత వైద్య కళాశాలల ఆధ్వర్యంలో నెల రోజుల క్రితం అనపర్తి మండలంలో 11, బిక్కవోలు మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇంటింటా దంత పరీక్షల కార్యక్రమాన్ని చేపట్టి 13 వేల మందికి వైద్య సేవలు అవసరమని గుర్తించారు. వారందరికీ వైద్య సేవలు అందించేందుకు మూడు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దంతాల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని చెప్పారు. కాగా శిబిరంలో వైద్యులు రూపొందించిన రూ.30వేల విలువైన పళ్ల సెట్టును ఓ మహిళకు ఎమ్మెల్యే నల్లమిల్లి వైద్యుడి అవతారంలో అమర్చి తగు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల వైద్యులు, వైద్య విద్యార్థులు 150 మంది సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి చిన్నారెడ్డి, తేనెల శ్రీనివాస్, గొలుగూరి భాస్కరరెడ్డి, జుత్తుగ కృష్ణ, శివరామారెడ్డి పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బిక్కవోలు, సెప్టెంబరు 1: ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరి ఆరోగ్యంగా వుంటారని ద్రాక్షారామంకు చెందిన పిరమిడ్ మాస్టర్ మణికంఠ అన్నారు. కొంకుదురు శ్రీశివరామకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం జరిగిన ధ్యాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉపన్యాసం చేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన గొలుగూరి భాస్కరరెడ్డి, గంగావతి దంపతులు అన్నదానం నిర్వహించారు.

ముంపు సమస్యను పరిష్కరిస్తాం


డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 1: పట్టణంలో ముంపు సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 36,37,39 డివిజన్ల పరిధి లలితానగర్, ఆదెమ్మదిబ్బ, కృష్ణానగర్, లింగంపేట ప్రాంతాల్లో డ్రైనేజీ లు, సీసీ రోడ్ల నిర్మాణాలు ఆదివారం పరిశీలించారు. నాణ్యతతో సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డివిజన్ ఇన్‌చార్జిలు ఉర్లంకల లోకేశ్, టి.బాబి, వై.ప్రదీప్ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తదితరులు ఉన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

రంగంపేట, సెప్టెంబరు 1: రంగంపేటలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి ఆదివారం తెలిపారు. రంగంపేట శివారులోని ఖాళీ స్థలంలో కొందరు పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం దాడిచేశామన్నారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి మూడు మోటార్‌సైకిళ్లు, రూ.3,900 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉండ్రాజవరంలో శాంతిర్యాలీ

ఉండ్రాజవరం, సెప్టెంబరు 1: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఉండ్రాజవరంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆదివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త శాంతియుత ర్యాలీలో భాగంగా మండలంలోని మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు.

సత్యవాడలో ఇంటింటా ఫీవర్ సర్వే

ఉండ్రాజవరం, సెప్టెంబరు 1: మండలంలోని సత్యవాడలో వేలివెన్ను పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. రోగులకు మందులు పంపిణీచేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఇర్ఫాన్ సమావేశం జరిపి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్‌పీహెచ్‌వో ఎస్‌కే ఖాన్, సూపర్‌వైజర్ కె.సుభాషిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	డిమాంట్ కాలనీ
రాధాకృష్ణ	తంగలన్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్